epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా
వాయిస్ ఆఫ్ డెమోక్రసీ

సంపుటి: 01
సంచిక:351

24 క్యారెట్లు 105,457.00 | కిలో వెండి 1,20,547.00 | chourastha Digitals | 25.07.2026 శుక్రవారం, హైదరాబాద్

## మేం చమురు విక్రయించకపోతే ఇంకెవరూ అమ్మలేరు

- మా దేశ భద్రతకు ముప్పు వాటిల్లితే, గల్ఫ్ ప్రాంతంలోని మౌలిక సదుపాయాలు ఏవీ సురక్షితంగా ఉండవ్
- అమెరికాకు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్
- తీవ్రమవుతున్న అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు
- కంటికి కన్ను సిద్ధాంతంతో బదులిస్తామన్న ఇరాన్ విదేశాంగ మంత్రి
- ఆందోళనలో గ్లోబల్ మార్కెట్లు,ఆకాశాన్ని తాకుతున్న క్రూడాయిల్ ధరలు



5లో



రాహుల్ గాంధీ నివాసంలో అత్యవసర భేటీ

# విద్యార్థులకు ఇండి కూటమి మద్దతు

### పార్లమెంట్ వ్యూహాలపై సుదీర్ఘ చర్చలు

విద్యార్థులు వీధుల్లోకి వచ్చారు..
అందుకే మేం కూడా వీధుల్లోకి వచ్చాం
రాహుల్ గాంధీ

గాంధీ స్మృతి కేంద్రంలో కొవ్వొత్తుల ప్రదర్శన
నీట్ లీక్ వల్ల ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నివాళి
విద్యార్థులు వంటరిగా లేరని, వారికి 'మేమంతా అండగా ఉంటాం

నీట్ పేపర్ లీకేజీలో బాధ్యులపై చర్యల కోసం, విద్యావ్యవస్థలో సంస్కరణల కోసం దేశవ్యాప్తంగా సీజేపీ, విద్యార్థులు చేపట్టిన ఆందోళనలకు మద్దతుగా నిలవాలని విపక్ష కూటమి (ఇండి అలియన్స్) నిర్ణయించింది. ఈ మేరకు రాహుల్ గాంధీ నివాసంలో గురువారం ఇండి కూటమి అత్యవసర భేటీ అయ్యింది. అనంతరం అక్కడి నుంచి గాంధీ స్మృతి కేంద్రం వరకు బస్ కాన్వాయ్ ర్యాలీ నిర్వహించింది. నీట్ పేపర్ లీక్ వల్ల మృతిచెందిన విద్యార్థులకు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. విద్యార్థులు వంటరిగా లేరని, వారికి 'మేమంతా అండగా ఉంటాం' అని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీ నివాసంలో జరిగిన సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, ప్రియాంకగాంధీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పీ చిదంబరం, జైరామ్ రమేష్, కేసీ వేణుగోపాల్, ఆర్జేడీ, టీఎంసీ, సీపీఐ(ఎం), ఆర్‌ఎస్పీ, ఇతర ఇండియా బ్లాక్ భాగస్వామ్య పార్టీలకు చెందిన ఎంపీలు హాజరయ్యారు

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**

.సీజేపీ నిరసనలకు మద్దతుపై, పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై సుదీర్ఘ చర్చలు జరిపారు. అనంతరం కూటమి ఎంపీలు.. విద్యార్థుల డిమాండ్లకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం అక్కడి నుంచి సెంట్రల్ ఢిల్లీలోని గాంధీ స్మృతి కేంద్రం వరకు ఇండి కూటమి ఎంపీల బృందం బస్ కాన్వాయ్ ర్యాలీ

।మిగతా 2 లో।

## బీఆర్ఎస్ మౌనంగా దేనికి..?



**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

నీట్ పేపర్ తో సహా పలు ప్రశ్నాపత్రాల లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని బీఆర్ఎస్ నేతలు ఎందుకు డిమాండ్ చేయడం లేదని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఆయన రాజీనామాను డిమాండ్ చేస్తూ దేశంలోని యువత, విద్యార్థులు, వివిధ తరగతుల ప్రజలు రోడ్లెక్కి నిరసనలు చేస్తుంటే బీఆర్ఎస్ మౌనంగా ఉండటం దేనికి సంకేతం అని నిలదీశారు. అసలు బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఉన్న కుమ్మక్కేంటని అడిగారు.

।మిగతా 2 లో।

- బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఉన్న కుమ్మక్కేంటి
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయదు
- ఆ పార్టీ అవయవదానంతోనే బీజేపీకి అధికారం
- కాంగ్రెస్ ఓటు బ్యాంకును దెబ్బతీయడమే లక్ష్యంగా సర్
- మిగిలిన 30 శాతం చాలా కీలకం అవగాహన లేకున్నా.. ఓటు పోయే ప్రమాదం
- బీజేపీ నేతల మధ్య అంతర్గత ఘర్షణలు
- బీఆర్ఎస్ తప్పులపై విచారణ సాగుతోంది
- మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిలో సీఎం రేవంత్‌రెడ్డి



## ఘనంగా జననీ డైలాగ్స్ తొలి జాతీయ సదస్సు

- హన్మకొండ వేదికగా సంతాన సంరక్షణపై కీలక చర్చ
- కుటుంబ నిర్మాణం,సంతానోత్పత్తి ఆరోగ్యం....
- మారుతున్న జీవనశైలిపై ప్రజలకు అవగాహన ఉద్దేశం
- పునరుత్పత్తి వైద్య రంగాన్ని బలోపేతం చేయడానికి 'ఒయాసిస్ అకాడమీ'
- ఒయాసిస్ ఫెర్టిలిటీ సహ వ్యవస్థాపకురాలు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గా జి.రావు
- నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు నిరంతరం కృషి
- ఒయాసిస్ ఫెర్టిలిటీ రీజినల్ మెడికల్ హెడ్ డాక్టర్ జలగం కావ్య రావు

2లో

## ప్రజాసేవే ధ్యేయంగా... మహబూబ్ రెడ్డి

- నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి
- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి...
- టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝూన్సీ ఆదేశాలతో మరింత ముందుకు....
- రాజకీయాల కంటే సేవాభావం ముఖ్యమని నమ్మిన మహబూబ్ రెడ్డి
- ఏ ఇంటికి కష్టం వచ్చిన ముందుంటూ ప్రజల మనిషిగా గుర్తింపు...

2లో



## సీజేపీ ఆందోళనపై కేంద్రం ఉక్కుపాదం

- ఢిల్లీలో ఎన్ఎస్ఏ అమలుకు నిర్ణయం
- ఏడాది పాటు నిరసనకారుల నిర్బంధానికి పోలీసులకు అధికారం
- గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన లెఫ్టినెంట్ గవర్నర్
- జంతర్ మంతర్‌కు భారీగా తరలివచ్చిన విద్యార్థులు, యువత
- నేడు దేశవ్యాప్త ఆందోళనలకు సీజేపీ పిలుపు

5లో




## నేడు విద్యాసంస్థలు బంద్

- పలు యూనివర్సిటీ పరిధిలో పరీక్షలు వాయిదా
- బంద్ దృష్ట్యా పరీక్షలు వాయిదా
- వాయిదా పడిన పరీక్ష కొత్త తేదీని త్వరలో ప్రకటిస్తాం
- నీట్ పేపర్ లీకేజీ దోషులను శిక్షించాలి
- కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి
- కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలి
- ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ, ఏఐఎఫ్‌డీఎస్,విద్యార్థి సంఘాలు

5లో

# సీఎంకు కేటీఆర్ లీగల్ నోటీసులు

- 48 గంటల్లో రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి
- నా ప్రతిష్ఠ దెబ్బతీసేలా వ్యాఖ్యలు
- గ్లోబరీనా టెక్నాలజీస్‌తో నాకు సంబంధం లేదు
- ఆధారాల్లేకుండా తప్పుడు ప్రచారం
- సీబీఐ విచారణకు నేను సిద్ధం.. రేవంత్‌రెడ్డి సిద్ధమా?
- అవసరమైతే లై డిటెక్టర్ టెస్ట్‌కూ సిద్ధమే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

గ్లోబరీనా టెక్నాలజీస్ సంస్థ వ్యవహారంలో తనపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అసత్య ఆరోపణలను ఉపసంహరించుకుని, 48 గంటల్లో భేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రేవంత్‌రెడ్డికి లీగల్ నోటీసులు జారీ చేశారు. గ్లోబరీనా టెక్నాలజీస్ సంస్థతో తనకు ఎలాంటి ఆర్థిక సంబంధాలు, యాజమాన్య హక్కులు లేదా ఇతర అనుబంధాలు లేవని కేటీఆర్ స్పష్టంచేశారు.ఎలాంటి ఆధారాలు లేకుండానే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి మీడియా వేదికగా అసత్య ప్రచారం చేశారని ఆరోపించారు. గ్లోబరినా సంస్థ తన బినామీ కంపెనీ అని, ఆ సంస్థకు సీబీఎస్ఈ కాంట్రాక్టులు ఇప్పించానని చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు తన వ్యక్తిగత, రాజకీయ ప్రతిష్టను దెబ్బతీసే ఉద్దేశంతోనే చేసినవని విమర్శించారు. అత్యున్నత రాజ్యాంగ పదవిలో

।మిగతా 2 లో।





# ప్రజాసేవే ధ్యేయంగా...
# మహబూబ్ రెడ్డి

## నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి





**తొర్రూర్, తెలంగాణ చౌరస్తా:**

మహబూబాబాద్ జిల్లా, తొర్రూర్ మండల రాజకీయాల్లో ప్రజలతో మమేకమై,సేవా కార్యక్రమాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన నాయకుడు జక్కన్న మహబూబ్ రెడ్డి.రాజకీయాలను పదవుల కోసం కాకుండా ప్రజలకు సేవ చేసే వేదికగా భావిస్తూ, గత మూడు దశాబ్దాలుగా ప్రజా జీవితంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. జక్కన్న మహబూబ్ రెడ్డి మడిపల్లి గ్రామంలో జక్కాంతమ్మ,సాయి రెడ్డి దంపతులకు జన్మించారు.అదే గ్రామంలో పెరిగి విద్యాభ్యాసం పూర్తి చేసి డిగ్రీ గ్రాడ్యుయేట్ అయ్యారు. చిన్ననాటి నుంచే సామాజిక సేవ, ప్రజాసేవ పై ఆసక్తి పెంచుకున్న మహబూబ్ రెడ్డి,ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకుంటూ సేవా మార్గాన్ని ఎంచుకున్నారు.1995లో రాజకీయాల్లోకి ప్రవేశించిన జక్కన్న మహబూబ్ రెడ్డి పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ సాధారణ కార్యకర్తగా తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించారు.క్రమంగా ప్రజల విశ్వాసాన్ని సంపాదించి మాజీ ఎంపీటీసీగా బాధ్యతలు నిర్వహించి గ్రామీణాభివృద్ధికి తన వంతు కృషి చేశారు. తొర్రూర్ మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో ప్రజలతో ఆత్మీయ అనుబంధాన్ని ఏర్పరుచుకున్న ఆయన,ఏ కుటుంబంలో విషాదం జరిగినా ముందుగా వెళ్లి పరామర్శించే నాయకుడిగా గుర్తింపు పొందారు.ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలుస్తూ,కుటుంబ సభ్యుడు మరణించిన నిరుపేద కుటుంబాలకు రూ.3,000 నగదుతో పాటు 25 కిలోల బియ్యం అందిస్తూ మానవతా దృక్పథాన్ని చాటుతున్నారు.ఇప్పటి వరకు 80కు పైగా నిరుపేద కుటుంబాలకు ఈ విధంగా సహాయసహకారాలు అందిస్తూ,వారి కష్టకాలంలో అండగా నిలుస్తునే,ప్రతి ఇంటింటికి ఏ కష్టం వచ్చిన ముందుంటూ తన సహాయాన్ని కొనసాగించారు.పలు సేవా కార్యక్రమాలు చేస్తూ,సమాజ అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తూ,ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు."మానవ సేవే మాధవ సేవ" అనే స్ఫూర్తితో ప్రతి అవసరంలో ప్రజలకు అండగా నిలుస్తూ సేవా పథంలో కొనసాగుతున్నారు.ప్రజా సేవలో భాగంగా పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి,టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీ రెడ్డి ఆదేశాలు,మార్గదర్శకత్వంలో పార్టీ కార్యక్రమాలు,సేవా కార్యక్రమాలు,ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు.ఆయన సతీమణి ప్రతిభా రెడ్డి.వీరికి కుమార్తె ఆరాధ్య రెడ్డి, కుమారుడు అర్జున్ సౌరిష్ రెడ్డి ఉన్నారు. కుటుంబ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూనే ప్రజా జీవితంలో సేవాభావంతో ముందుకు సాగుతున్నారు.ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలవడం,ఆపదలో ఉన్నవారికి అండగా ఉండడం ,పార్టీ సిద్ధాంతాల కోసం నిబద్ధతతో పనిచేయడం, సేవను రాజకీయాల కంటే గొప్పదిగా భావించడం జక్కన్న మహబూబ్ రెడ్డి వ్యక్తిత్వానికి నిదర్శనం. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ,మరింత విస్తృత స్థాయిలో ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో ఆయన రాజకీయ ప్రస్థానం విజయవంతంగా కొనసాగుతోంది.ప్రజాసేవే పరమావధిగా,ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తూ,సమాజ అభివృద్ధి,యువత సాధికారత, సామాజిక న్యాయం,ప్రజా సంక్షేమం కోసం అంకితభావంతో,ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ సేవా మార్గంలో నిరంతరం కృషి చేస్తూ ముందుకు సాగుతున్నారు.

# సీఎంకు కేటీఆర్ లీగల్ నోటీసులు

**తరువాయి భాగం**

ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి నిరాధార ఆరోపణలు చేయడం బాధ్యాతారాహిత్యమని మండిపడ్డారు. రాజకీయ ప్రయోజనాల కోసం తన పరువుకు భంగం కలిగించేలా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం సరికాదని హితవు పలికారు. ముఖ్యమంత్రి చేసే అసభ్యకరమైన, నిరాధారమైన ఆరోపణలకు తాను చాలా సందర్భాల్లో స్పందించలేదని, అవి అంతగా విలువలేనివని భావించానని పేర్కొన్నారు. తన మౌనాన్ని బలహీనతగా లేదా ఆరోపణలను అంగీకరించినట్లుగా భావించవద్దని స్పష్టం చేశారు. బురద రాజకీయాల్లో దిగడానికి తనకు ఆసక్తి లేదని స్పష్టం చేశారు. 48 గంటల్లోగా భేషరతుగా బహిరంగ క్షమాపణలు చెప్పి ఆరోపణలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో సివిల్, క్రిమినల్ చర్యలతోపాటు పరువు నష్టం దాఖలు చేస్తామని హెచ్చరించారు. గురువారం ఉదయం హన్మకొండలో పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొని మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. అనంతరం మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్ మాట్లాడారు. గ్లోబరినా సంస్థతో తనకు ఎలాంటి సంబంధం లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.ఆ సంస్థ నిజంగానే తన బినామీ సంస్థ అయితే, అదే సంస్థతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఒప్పందాలు చేసుకుందని ప్రశ్నించారు. ప్రభుత్వం ఒకవైపు ఆ సంస్థతో ఒప్పందాలు చేసుకుని, మరోవైపు అది తన బినామీ సంస్థ అని ఆరోపించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ముఖ్యమంత్రి ఒక్కసారి కూడా ప్రధాని నరేంద్ర మోదీ పేరును ప్రస్తావించలేదని విమర్శించారు.

# విద్యార్థులకు ఇండి కూటమి మద్దతు

**తరువాయి భాగం**

నిర్వహించారు. దీనికి రాహుల్ గాంధీ నేతృత్వం వహించారు. ఎంపీలతో కూడిన మూడు బస్సుల కాన్వాయ్‌ను రాహుల్ గాంధీ నివాసం వెలుపల ఢిల్లీ పోలీసులు నిలిపేశారు.

దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆ తర్వాత ముందుకు వెళ్లడానికి అనుమతించారు. కాన్వాయ్, బస్సులు కొన్ని మీటర్లు మాత్రమే ముందుకు వెళ్లగా పోలీసులు మళ్లీ ఆపివేశారు. బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. 'మా విద్యార్థులు వీధుల్లోకి వచ్చారు. అందుకే మేము కూడా వీధుల్లోకి వచ్చాం.మేము గాంధీ స్మృతి కేంద్రానికి వెళ్తుండగా మమ్మల్ని అడ్డుకున్నారు. మా ఎంపీలందరూ అక్కడికి వెళ్లాలనుకున్నారు. కానీ అనుమతి నిరాకరించారు. ఇక్కడ బస్సులను నిలిపివేశారు. అందుకే మేము ముందుకు వెళ్లలేకపోతున్నాం' అని తెలిపారు. కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ కూడా పోలీసుల చర్యను ప్రశ్నించారు. 'పార్లమెంటు లోకి ప్రవేశించడానికి అనుమతి ఉన్నవారు గాంధీ స్మృతికి వెళ్లలేరా? ఈ బారికేడ్లు ఎందుకు? మేమేమైనా గూండాల మా లేక నేరగాళ్లమా?' అని ఆయన పేర్కొన్నారు.

దీంతో మళ్లీ కొద్దిసేపు ఉద్రిక్తతకు దారితీసింది. అనంతరం పోలీసులు బారికేడ్లను తొలగించి, గాంధీ స్మృతి వైపు కాన్వాయ్‌ను వెళ్లనిం చారు. మార్గమంతా భారీ బందోబస్తు కల్పించారు. తర్వాత గాంధీ స్మృతి కేంద్రానికి చేరుకొని కొవ్వొత్తులో ప్రదర్శన చేపట్టారు. నీట్ పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నివాళులు అర్పించారు. గాంధీ స్మృతి కేంద్రం వద్ద రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. విద్యార్థులు ఒంటరి వారు కాదని, వాళ్లకు అండగా ఉంటామని ప్రకటించారు. నీట్ పేపర్ లీక్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులను గౌరవించడానికి, నిరసనల సమ యంలో గాయపడిన వారికి అండగా నిలవడానికి ఇండియా కూటమి గాంధీ స్మృతిని సందర్శించిందని రాహుల్ గాంధీ తెలిపారు. శాంతియుతంగా న్యాయం, జవాబుదారీతనం కోసం దెబ్బలు తిని, నేడు గాయపడిన విద్యార్థులకు 'మేము అండగా నిలుస్తాం' అని అన్నారు. భారతదేశ విద్యార్థులు ఒంటరిగా లేరని, వారికి, వారి డిమాండ్లకు ప్రతిపక్షమంతా అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ మౌనం దేనికి.?

**తరువాయి భాగం**

గురువారం హైదరాబాద్ లో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఓటు చాలా ముఖ్యమనీ, సర్ ప్రకియ లో మిగిలిన 30 శాతం చాలా కీలకమని సీఎం చెప్పారు. ఆ ప్రక్రియలో బీఎల్‌వో పాత్ర మరింత కీలకమన్నారు. తన ఓటును కొడంగల్ కు బదిలీ చేసుకున్నట్టు వెల్లడించారు. సర్ ప్రక్రియతో గ్రామాల్లోని దళితులు, గిరిజనుల, మైనార్టీల ఓట్లు పోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. అదే జరిగితే పథకాలు, ఆధార్, గుర్తింపు, సంక్షేమం దూరమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ ఓటు బ్యాంక్ ను దెబ్బతీయడమే లక్ష్యంగా సర్ ప్రక్రియ జరుగుతున్నదని ఆరోపించారు. బీజేపీ నాయకుల మధ్య అంతర్గత ఘర్షణలున్నాయనీ, ఒకరంటే ఒకరికి పడదని సీఎం తెలిపారు. బీఆర్ ఎస్ పేదలకిచ్చే ఇండ్లను దళారులకు అమ్ముకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో ఇంటర్మీడియట్ పేపర్లు సరిగ్గా దిద్దక పోవడంతో 27 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారనీ, దానికి కారణమైన గ్లోబరీనా కేటీఆర్ బినామీ సంస్థ ఆరోపించారు. ప్రజలకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలనీ, అమరవీరుల స్థూపం దగ్గర కేటిఆర్ ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు.

గ్లోబరీనా సంస్థ పైన కేటీఆర్ సీసీఎస్ లో ఫిర్యాదు చేయాలని సవాల్ విసిరారు. తాము విచారణ చేస్తే కక్ష సాధింపు అంటారన్నారు. గ్లోబరినాపై నివేదిక వచ్చాక ఏం చేయాలో అది చేస్తామన్నారు. పరువున్నవారు వేస్తే దాన్ని పరువు నష్టం దావా అంటారన్నారు. జన్వాడ ఫార్మ్ హౌస్ లో ఏ రాజుల భూములున్నాయో విచారణకు డిమాండ్ చేయాలని కేటీఆర్ కు సూచించారు. తాము తిరిగి తెరిచిన ధర్నా చౌక్ లోనే కేటీఆర్ ధర్నా చేస్తామని అంటున్నారని ఎద్దేవా చేశారు. చెరువులను పునరుద్ధరిస్తూ, .ప్రభుత్వ భూములను కాపాడుతూ హైడ్రా బ్రహ్మాండంగా పని చేస్తున్నదని కొనియాడారు. మాజీ సీఎం కేసీఆర్ కు తెలియకుండా కాళేశ్వరంలో వందల కోట్లు రూపాయలను తీసుకున్నాడనే కారణంతోనే హరీశ్‌రావును ఆ శాఖ నుంచి తప్పించారని ఆరోపించారు. అతి తెలివితో ఏది పడితే అది మాట్లాడితే కుదరదని హెచ్చరించారు. తనను ఎందుకు నీటిపారుదల శాఖ మంత్రి పదవి నుంచి తొలగించారో చెప్పాలని మాజీ మంత్రి హరీశ్ రావుకు సవాల్ విసిరారు. ఎన్డీఎస్ఏ చెప్పింది వినాలా వద్దా? వినియోగంలోకి తేవాలంటే పరీక్షలు చేయాలని చెప్పాక కూడా మేడిగడ్డ ఎక్కడ ఎత్తిపోయాలా? అని ప్రశ్నించారు. పంపులు, బిల్లులు,



కమీషన్లు కథ అయిపోయిందనీ, బీఆర్ఎస్ నేతలు కన్నెపల్లి పంపు హౌజ్ గురించి మాట్లాడుతున్నారనీ, మేడిగడ్డ గురించి ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. 'మేడిగడ్డ గురించి మాట్లాడితే ప్రజలు చెప్పుతో కొడతారు. మేడిగడ్డ కట్టింది, కూల్చింది బీఆర్ఎస్ వాళ్ళే. బీఆర్ఎస్ నేతలు సీబీఐ ను మేనేజ్ చేసుకున్నాం.ఎదురుదాడి చేస్తే సరిపోద్ది అనుకుంటున్నారు.బీఆర్ఎస్ హయాంలో కాఫర్ డ్యాం ఎందుకు కట్టలేదు?' అని సీఎం ప్రశ్నించారు. కన్నె పల్లి పంప్ హౌస్ హరీశ్ రావు సాగునీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు నిర్మాణమైందని గుర్తుచేశారు.అతి తెలివి తో మాట్లాడితే పిచ్చి లేసిందని హరీశ్ రావును మెంటల్ ఆస్పత్రిలో చేర్పిస్తారని హెచ్చరించారు. కాళేశ్వరం లో గేట్లు ఎత్తి వేయాలని నిపుణులు స్పష్టం చేశారనీ, ఎన్డీఎస్ ఏ చైర్మెన్ స్వయంగా కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించారని తెలిపారు. ఈ విషయం గురించి హరీశ్ రావు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. దేవాదులలో అన్ని పంపులు పని చేస్తున్నాయనీ, మేడిగడ్డ దగ్గర కాపర్ డ్యామ్ ఆకాశం నుంచి దిగి రాదనీ, మరో డ్యామ్ కట్టేందుకు ఐదు మీటర్ల నీళ్లు ఉండాలంటే మేడిగడ్డ గేట్లు దిగాల్సిందేననీ స్పష్టం చేశారు. ఒక్క రోజు మాత్రమే లక్ష క్యూ సెక్కుల నీళ్లు వచ్చాయనీ, నీళ్లు నిలపకపోతే బ్యారేజ్ లు ఎందుకు నిర్మించారని ప్రశ్నించారు. మేడిగడ్డ అంటే ప్రజలు తన్నుతారనే కన్నెపల్లి పంప్ హౌస్ గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.కాళేశ్వరం పైన ఎన్డీఎస్ఏ, పీసీ ఘోష్ నివేదిక స్పష్టం ఉందనీ, కాళేశ్వరం పైన సీబీఐ విచారణను కోరామని ఆయన గుర్తుచేశారు.

బీఆర్ఎస్ అవయవదానంతో బీజేపీకి అధికారం పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవదానం చేసి బీజేపీని గెలిపించిందనీ, అందులో బీఆర్ఎస్ కు అధికారం ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సిద్దిపేట ,గజ్వేల్, సిరిసిల్ల లో లోకసభ ఎన్నికల్లో బీజేపీకి ఎందుకు మెజారిటీ వచ్చింది? తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు రక్తం ధారపోశారే తప్ప కేసీఆర్, కేటిఆర్, హరీష్‌రావు, సంతోశ్‌రావు చుక్క రక్తం ఇచ్చారా? అని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు కూడా పేదల రక్తం అమ్ముకుంటున్నారని విమర్శించారు. ఉద్యోగాల భర్తీ పైన అసెంబ్లీ లో కేటీఆర్ ప్రశ్నిస్తే, పేర్ల తో సహా నియామకాల లిస్ట్ ఇస్తానని సీఎం స్పష్ఠం చేశారు. ఉద్యోగాలపై చర్చకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. నోటిఫికేషన్ ఇవ్వడం, ప్రశ్నపత్రం అమ్ముకోవడం బీఆర్ఎస్ విధానమైతే నోటిఫికేషన్లు ఇచ్చి నియామక పత్రాలు ఇవ్వడం తమ విధానమని తెలిపారు. టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామన్నారు. 55 రోజుల్లో 11 వేల టీచర్ ఉద్యోగాలను భర్తీ చేశామని వివరించారు. ఆహార కల్తీపై కఠినంగా ఉన్నామని తెలిపారు. ఐదు లక్షల పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని నిర్ణయించామన్నారు..

- హన్మకొండ వేదికగా సంతాన సంరక్షణపై కీలక చర్చ
- కుటుంబ నిర్మాణం,సంతానోత్పత్తి ఆరోగ్యం....
- మారుతున్న జీవనశైలిపై ప్రజలకు అవగాహన ఉద్దేశం
- పునరుత్పత్తి వైద్య రంగాన్ని బలోపేతం చేయడానికి 'ఒయాసిస్ అకాడమీ'
- ఒయాసిస్ ఫెర్టిలిటీ సహ వ్యవస్థాపకురాలు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గా జి.రావు
- నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు నిరంతరం కృషి
- ఒయాసిస్ ఫెర్టిలిటీ రీజినల్ మెడికల్ హెడ్ డాక్టర్ జలగం కావ్య రావు

# ఘనంగా 'జననీ డైలాగ్స్'
# తొలి జాతీయ సదస్సు



**హన్మకొండ , తెలంగాణ చౌరస్తా:**

హన్మకొండ లో ఒయాసిస్ ఫెర్టిలిటీ ఆధ్వర్యంలో 'జననీ డైలాగ్స్' తొలి జాతీయ సదస్సును అత్యంత ఘనంగా నిర్వహించారు.భారతదేశంలో కుటుంబ నిర్మాణం,సంతానోత్పత్తి ఆరోగ్యం,మారుతున్న జీవనశైలిపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.హైదరాబాద్ కేంద్రంగా జరిగిన ఈ ప్రధాన చర్చను హన్మకొండతో పాటు వివిధ నగరాల్లో ప్రత్యక్ష ప్రసారం చేశారు.దీని ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలకు ఒకే వేదిక అందుబాటులోకి వచ్చింది.ప్రజారోగ్య నిపుణులు ,ప్రభుత్వ ప్రతినిధులు,మనస్తత్వవేత్తలు,హెచ్ఆర్ నాయకులు,శిశు సంక్షేమ శాఖ అధికారులు,పునరుత్పత్తి వైద్య నిపుణులు ఈ వేదికపై ఒకచోట చేరి విస్తృతంగా చర్చించారు.కుటుంబాలకు అనుకూలమైన భారతదేశాన్ని నిర్మించడానికి అన్ని రంగాల వారు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై ఈ సదస్సులో కూలంకషంగా ఆలోచనలు పంచుకున్నారు.భారతదేశంలో కుటుంబాలను నిర్మించుకునే విధానంలో నిశ్శబ్దంగా కానీ గణనీయమైన మార్పులు వస్తున్నాయని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు.దేశం యొక్క మొత్తం సంతానోత్పత్తి రేటు ఇప్పటికే జనాభా భర్తీ స్థాయి కంటే తక్కువగా పడిపోవడం గమనార్హం.ఈ జనాభా మార్పునకు ఆలస్యంగా జరుగుతున్న వివాహాల కంటే, విద్య, వృత్తి, ఆర్థిక భద్రత,వ్యక్తిగత ఆకాంక్షలకు ప్రాధాన్యత నిస్తూ దంపతులు ఉద్దేశపూర్వకంగా సంతానోత్పత్తిని వాయిదా వేయడమే ప్రధాన కారణమని గుర్తించారు. ఆధునిక జీవనశైలి వేగంగా మారుతున్నప్పటికీ, సంతానోత్పత్తి సామర్థ్యం మాత్రం తన సహజ క్రమంలోనే సాగుతుంది.ఈ కారణంగా ముందస్తు అవగాహన, నివారణ ఆరోగ్య సంరక్షణ మరింత ముఖ్యమైనవిగా మారుతున్నాయి.సరైన సమయంలో తగిన నిర్ణయాలు తీసుకోవడం ద్వారా చాలా వరకు సంతానలేమి సమస్యలను నివారించవచ్చని నిపుణులు స్పష్టం చేయడం విశేషం.మారుతున్న జీవిత ఆకాంక్షలకు, మారకుండా ఉన్న జీవసంబంధ వాస్తవాలకు మధ్య పెరుగుతున్న అంతరాన్ని 'పేరెంట్‌హుడ్ పారడాక్స్' లేదా తల్లిదండ్రులు కావాలనే ఆకాంక్ష-వాస్తవాల మధ్య వైరుధ్యంగా అభివర్ణించారు.ఎవరి వ్యక్తిగత నిర్ణయాలను ప్రభావితం చేయడం తమ లక్ష్యం కాదని, కానీ సకాలంలో అవగాహన కల్పించడం ద్వారా సరైన నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహించడమే తమ ధ్యేయమని ప్యానెలిస్టులు తెలిపారు.తల్లిదండ్రులు కావడానికి అయ్యే ఆర్థిక వ్యయం,పిల్లల పెంపకం,ఆర్థిక ప్రణాళికలను వ్యక్తిగత భారంగా కాకుండా కుటుంబ నిర్మాణానికి అవసరమైన తోడ్పాటుగా భావించాలని వక్తలు సూచించారు.పిల్లల పెంపకంలో తండ్రుల పాత్రను బలోపేతం చేయడం,కార్యాలయాలు,విద్యాసంస్థలు కుటుంబాలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ వేదిక ద్వారా బలంగా చెప్పారు.సభను ఉద్దేశించి ఒయాసిస్ ఫెర్టిలిటీ సహ వ్యవస్థాపకురాలు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గా జి.రావు మాట్లాడుతూ.... కుటుంబ నిర్మాణం కోసం ప్రణాళిక చేసుకోవడం క్రమంగా కష్టతరం అవుతోందని తెలిపారు.దీనికి ప్రజల్లో ఆసక్తి తగ్గడం కారణం కాదని,జీవసంబంధ కాలపరిమితి,ఆర్థిక వ్యయం,ఉద్యోగ ఒత్తిళ్లు పరస్పరం భిన్న దిశల్లో ప్రభావం చూపడమేనని వివరించారు. కుటుంబాలు ఒంటరిగా ముందుకు సాగకుండా ప్రభుత్వం,ఆరోగ్య నిపుణులు,ఉద్యోగదాతలు,సమాజంలోని వివిధ వర్గాలను ఒకే వేదికపైకి 'జనని డైలాగ్స్' తీసుకువచ్చిందన్నారు.పునరుత్పత్తి వైద్య రంగాన్ని బలోపేతం చేయడానికి అంకితమైన 'ఒయాసిస్ అకాడమీ'ని ప్రారంభిస్తున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు.ఈ అకాడమీ పరిశోధనలు, క్లినికల్ అధ్యయనాలు, నాలెడ్జ్ ట్రాన్స్‌ఫర్ మరియు నిపుణులకు శిక్షణ ఇవ్వడం వంటి మూడు కీలక రంగాలలో తన సేవలను విస్తృతంగా అందిస్తుందని స్పష్టం చేశారు .ఈ అకాడమీ శాస్త్రీయ సహకారాన్ని పెంపొందించడానికి, జాతీయ, అంతర్జాతీయ విద్యా వేదికలలో భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి వేదికగా పనిచేస్తుందని నిర్వాహకులు తెలిపారు.ఇటీవలి ESHRE 2026లో 29 శాస్త్రీయ పత్రాలను సమర్పించడం ద్వారా ప్రపంచ పునరుత్పత్తి వైద్య రంగానికి సంస్థ అందిస్తున్న సహకారాన్ని చాటుకున్నారు.ఇప్పటివరకు 250 మందికి పైగా క్లినిషియన్లకు, 200 మందికి పైగా ఎంబ్రియాలజిస్టులకు ఈ అకాడమీ శిక్షణనిచ్చింది.ముఖ్యంగా టైర్2, టైర్3 ప్రాంతాలలో ఈ ప్రత్యేక శిక్షణను మరింత విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.ఒయాసిస్ ఫెర్టిలిటీ రీజినల్ మెడికల్ హెడ్ డాక్టర్ జలగం కావ్య రావు మాట్లాడుతూ...ముందస్తు అవగాహన పెంపొందించుకోవడం ఎంత ముఖ్యమో ఈ సదస్సు స్పష్టం చేస్తోందని, నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయడానికి నిరంతరం కృషి చేస్తామన్నారు.

జనని డైలాగ్స్ అనేది కేవలం ఒక ప్రజా ప్రయోజన వేదిక మాత్రమేనని,ఐవీఎఫ్ లేదా సంతాన సాఫల్య చికిత్సలకు సంబంధించిన ప్రచార వేదిక కాదని ఒయాసిస్ ఫెర్టిలిటీ స్పష్టం చేసింది. ఇది ఏ వైద్య విధానాన్ని బలవంతంగా ప్రోత్సహించదని ,ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పిల్లలను కనాలని సూచించదని తేల్చిచెప్పింది.బదులుగా దంపతులకు, కుటుంబాలకు మధ్య అడ్డుగా నిలుస్తున్న ఆర్థిక, వైద్య, కార్యాలయ,సామాజిక అంశాలపై ఇది దృష్టి పెడుతుందని పేర్కొంది. ప్రభుత్వం, యజమానులు, ఆరోగ్య సంరక్షణ ప్రదాతలు ఈ సమస్యల పరిష్కారానికి ఒక్కొక్కరుగా ఏమి చేయగలరనే అంశాలపై సమాజంలో చర్చను లేవనెత్తడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు.భవిష్యత్తులోనూ ఇటువంటి సదస్సుల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం 'జనని డిక్లరేషన్' తో ముగిసింది. జీవితకాల పునరుత్పత్తి ఆరోగ్యం, సమాచారంతో కూడిన ఎంపికలు, ఉమ్మడి బాధ్యత, తల్లిదండ్రులుగా మారే ప్రతి మార్గానికి గౌరవం, వృత్తి,కుటుంబ ఆకాంక్షలను సమతుల్యం చేసుకోవడం, కుటుంబ స్నేహపూర్వక భారతదేశాన్ని నిర్మించడానికి సామూహిక నిబద్ధత అనే ఆరు మార్గదర్శక సూత్రాలను ఇందులో పొందుపరిచారు.భారతదేశ వ్యాప్తంగా పునరుత్పత్తి ఆరోగ్యం, కుటుంబ నిర్మాణంలో అవగాహన, సేవల లభ్యత,స్థోమతను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ డిక్లరేషన్ రూపొందించారు. విధానపరమైన భాగస్వామ్యం, పరిశోధన,బహుళరంగాల సహకారం ద్వారా జననీ డైలాగ్స్ ను ఒక వార్షిక ప్రజా ప్రయోజన కార్యక్రమంగా భవిష్యత్తులోనూ విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి ఒయాసిస్ ఫెర్టిలిటీ తమ పూర్తి నిబద్ధతను ఈ సందర్భంగా మరోసారి పునరుద్ఘాటించింది.

# సినారె స్మారక సాహితీ పురస్కారానికి రవీంద్ర సూరి ఎంపిక

- సాహిత్య రంగంలో మరో అరుదైన గౌరవం



**కూకట్ పల్లి తెలంగాణ చౌరస్తా:**

తెలుగు సాహిత్య ప్రపంచంలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్న మహాకవి, పద్మభూషణ్,జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా. సి. నారాయణరెడ్డి స్మారకంగా అందజేసే ప్రతిష్ఠాత్మక 2026 సినారె సాహితీ పురస్కారంకు సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామానికి చెందిన ప్రముఖ కవి, సినీ దర్శకుడు నామాల రవీంద్రసూరి ఎంపిక కావడం సాహిత్య వర్గాల్లో హర్షాతిరేకాలను వ్యక్తం చేస్తోంది. మహాకవి సినారె 95వ జయంతి వేడుకలను పురస్కరించుకుని సినారె కళాపీఠం, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ఆగస్టు 2న హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం సెమినార్ హాల్లో ఘనంగా నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు సినారె కళాపీఠం అధ్యక్షులు మల్లెకేడి రాములు ప్రకటించారు.సాహిత్యంతో పాటు సినీ రంగంలోనూ తనదైన ముద్ర వేసుకున్న రవీంద్రసూరి, తన రచనల ద్వారా సమాజానికి విలువైన సందేశాలను అందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయనకు ఈ గౌరవం దక్కడం తెలుగు సాహిత్యానికి, ముఖ్యంగా గ్రామీణ ప్రతిభకు లభించిన అరుదైన గుర్తింపుగా పలువురు సాహితీవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా తనను ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక చేసిన ఎంపిక కమిటీ సభ్యులకు, సినారె కళాపీఠం అధ్యక్షులు మల్లెకేడి రాములు గారికి రవీంద్రసూరి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారాన్ని తాను వ్యక్తిగత విజయంగా కాకుండా తెలుగు సాహిత్యానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. సినారె ఆశయాలను, సాహిత్య విలువలను భావి తరాలకు చేరవేసే దిశగా ఈ పురస్కారం విశేష ప్రాధాన్యతను సంతరించుకుందని, రవీంద్రసూరి ఎంపికతో ఈ ఏడాది పురస్కారానికి మరింత గౌరవం చేకూరిందని సాహిత్య, సాంస్కృతిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## అధికారుల విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- పెద్దపల్లి మండలం రంగాపూర్ గ్రామ సర్పంచ్ కి షోకాస్ నోటీస్ జారీ



**పెద్దపల్లి,తెలంగాణ చౌరస్తా :**


ప్రభుత్వ అధికారులు తమ విధులను నిర్వహించే సమయంలో ఆటంకాలు కల్పించడం, అసభ్యకరంగా ప్రవర్తించడం, బెదిరింపులకు పాల్పడడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు, పెద్దపల్లి మండలంలోని రంగాపూర్ గ్రామ సర్పంచ్ గంట రమేష్ ప్రభుత్వ అధికారిని విధుల నిర్వహణలో అడ్డుకోవడం, అసభ్యకర, అనుచిత పదజాలంతో దూషించడం, బెదిరింపులకు పాల్పడినట్లు పెద్దపల్లి సహాయ కార్యనిర్వహణ ఇంజనీర్ ఎం.బి. ఇంట్రా అందజేసిన ఫిర్యాదు మేరకు తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 37(1)(ii), 37(1)(iii) ప్రకారం షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఫిర్యాదును ప్రాథమికంగా పరిశీలించగా, అందులో పేర్కొన్న ఆరోపణలు సంబంధిత చట్టంలోని నిబంధనల పరిధిలోకి వస్తున్నట్లు గుర్తించిన నేపథ్యంలో, సంబంధిత సర్పంచ్‌కు కారణం చెప్పాలని కోరుతూ షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. షోకాజ్ నోటీసు అందిన తేదీ నుంచి ఏడు రోజులలోపు లిఖితపూర్వక సంజాయిషీని సమర్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. నిర్దేశించిన గడువులోగా సంజాయిషీ సమర్పించనట్లయితే, అందుబాటులో ఉన్న రికార్డులు, సాక్ష్యాధారాల ఆధారంగా తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018 ప్రకారం తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రభుత్వ అధికారులు చట్టబద్ధమైన విధులను నిర్వర్తిస్తారని, వారి విధుల నిర్వహణకు ఆటంకం కల్పించడం, బెదిరించడం లేదా అనుచితంగా ప్రవర్తించడం చట్టరీత్యా తీవ్రమైన విషయమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర గౌరవం, సమన్వయంతో ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## పాము కాటుతో యువకుడు మృతి



**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:**

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం మడిపల్లి శివారు సోమవరపు కుంట తండాకు చెందిన బానోత్ ప్రవీణ్ (25) పాము కాటుకు గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం బుధవారం రాత్రి భోజనం చేసి ఇంటి ముందు రేకుల షెడ్ లో కింద నిద్రిస్తున్న క్రమంలో రాత్రి 11 గంటలకు కట్ల పాము మేడ నరంలో కాటు వేయడంతో వెంటనే లేచి కాటు వేసిన పామును చంపేశాడు. కుటుంబ సభ్యులు హాస్పిటల్ కి వెళ్లి ఇంజక్షన్ వేయించాలని కోరిన ప్రవీణ్ ఏమి కాదని నిర్లక్ష్యం చేసి పడుకోవడంతో రాత్రి ఒంటిగంటకు వాంతులు,విరోచనాలు కావడం వల్ల చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడు ప్రవీణ్ చిన్న వయసులోనే తండ్రి బానోతు లాల్ సింగ్ మృతి చెందాడు. తల్లి బానోతు రంగమ్మ, భార్య మమత, ఐదుగురు అక్కలు ఉన్నారు.



## పద్మశాలి టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తొర్రూరు నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- అధ్యక్షుడిగా దాసరి చంద్రమౌళి,
- ప్రధాన కార్యదర్శిగా భోగ సంపత్

**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా**

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలో పద్మశాలి టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (PTWA) వ్యవస్థాపకులు బుదారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా దాసరి చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా భోగ సంపత్, కోశాధికారిగా చందా రవీంద్రకుమార్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా బుదారపు శ్రీనివాస్ మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు సంఘ నియమ నిబంధనలకు కట్టుబడి పనిచేస్తూ సంఘ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అలాగే ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన పద్మశాలి విద్యార్థులకు విద్యాపరంగా అండగా నిలిచి, వారి ఉన్నత చదువులకు సహాయ సహకారాలు అందించే దిశగా సంఘం సేవలను విస్తరించాలని పిలుపునిచ్చారు.నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు సంఘ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ,సభ్యుల సంక్షేమంతో పాటు విద్యార్థుల అభ్యున్నతికి ప్రత్యేక కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి టీచర్లు, కుల బాంధవులు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కమాన్‌పూర్ పిహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే ప్రసవాలు అయ్యేలా చూడండి
- డిఎమ్‌హెచ్‌ఓ వై. పవిత్ర





**కమాన్‌పూర్ తెలంగాణ చౌరస్తా:**

కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుద్ధ్య ప్రమాణాలను పాటిస్తూ, పరిశుభ్రతను పగడ్బందిగా నిర్వహించాలని పెద్దపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వై. పవిత్ర ఆదేశించారు. గురువారం రోజున డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరాములు, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీ భవానిలతో కలిసి కమాన్‌పూర్ పిహెచ్‌సీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని వార్డులు, లేబర్ రూమ్, ఆవరణను క్షుణ్ణంగా పరిశీలించారు. లేబర్ రూమ్‌తో పాటు వార్డుల లో క్రమం తప్పకుండా ఫ్యూమిగేషన్ చేయాలని సూచించారు. గర్భిణులకు అవగాహన కల్పించి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే ప్రసవాలు అయ్యేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశించారు.

**సిబ్బంది కొరతపై తక్షణ స్పందన..**

తనిఖీ సమయంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ సల్మా బేగం ఆసుపత్రిలోని సిబ్బంది కొరతను డిఎమ్‌హెచ్‌ఓ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సానుకూలంగా స్పందించిన డాక్టర్ వై. పవిత్ర.. తక్షణమే కమాన్‌పూర్ పిహెచ్‌సీకి ఒక స్టాఫ్ నర్స్‌ను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. త్వరలోనే మిగతా ఖాళీలను భర్తీ చేసి సేవలను మరింత సమర్థవంతంగా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



## కమాన్‌పూర్‌లో బీజేపీ శ్రేణుల ధర్నా

**కమాన్‌పూర్ తెలంగాణ చౌరస్తా:**

భారత ప్రధాని నరేంద్ర మోడీ నివాసాన్ని కాంగ్రెస్, దాని కూటమి పార్టీలు ముట్టడించడాన్ని నిరసిస్తూ కమాన్‌పూర్ మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొయ్యడ సతీష్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మత్స్యగిరి రాము పాల్గొన్నారు.అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లడుతూ..దేశంలో బిజెపిని లేకుండా చేయాలనే కుట్రతో రాహుల్ గాంధీ అండ్ కో నేతృత్వంలో ఇలాంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడుతున్నారని కొయ్యడ సతీష్, మత్స్యగిరి రాము ఆరోపించారు. దేశంలో ఇప్పటివరకు ఏ ప్రధాని ఇంటినీ ఈ విధంగా ముట్టడించిన దాఖలాలు లేవని, ఇది రాజ్యాంగ విరుద్ధమని మండిపడ్డారు. ప్రధాని మోడీ పారదర్శక పాలనకు దేశ ప్రజలు బ్రహ్మరథం పడుతుంటే ఓర్వలేకనే కాంగ్రెస్ పార్టీ ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు ఒడిగడుతోందన్నారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే ఊరుకునేది లేదని, కాంగ్రెస్ మంత్రులను, ఎమ్మెల్యేలను రోడ్లపై తిరగనివ్వమని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సీనియర్ నాయకులు మట్ట శంకర్, జంగపల్లి అజయ్, మల్లారపు సురేష్, మండల జనరల్ సెక్రెటరీ పంతకాని విశ్వతేజ, పెద్దపల్లి శ్యాంసుందర్, ఉపాధ్యక్షులు పిల్లి చంద్రయ్య, సదానందం, కార్యదర్శులు అగ్గి శ్రావణ్, సంపత్, శ్రీమన్, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పద్ధతి మార్చుకోవాలి

- మంత్రి శ్రీధర్ బాబు అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు
- రూ. 1000 కోట్ల అభివృద్ధిపై చర్చకు సిద్ధం
- జిల్లా కార్యదర్శి గాండ్ల మోహన్

**కమాన్‌పూర్ తెలంగాణ చౌరస్తా:**

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో మంథని నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గాండ్ల మోహన్ విమర్శించారు. కమాన్‌పూర్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గతంలో బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టించిన మధుకర్, ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వంపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో కమాన్‌పూర్ జెడ్పీటీసీగా, ఎమ్మెల్యేగా పనిచేసిన పుట్ట మధు ఈ మండలానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆనాడు కమాన్‌పూర్ పిహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా ఎందుకు అప్‌గ్రేడ్ చేయలేకపోయారో సమాధానం చెప్పాలన్నారు.ప్రస్తుతం నియోజకవర్గంలో దాదాపు రూ. 1,000 కోట్లతో జరుగుతున్న అభివృద్ధిపై ఎలాంటి చర్చకైనా తాము సిద్ధమని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ నాయకులు పద్ధతి మార్చుకోకపోతే తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మల్యాల తిరుపతి, గడప కృష్ణమూర్తి, బొంపల్లి రాజయ్య, అప్సర్, దాసరి గట్టయ్య, నగునూరి నరసయ్య, కోలిటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## వాసిరెడ్డి వెంకటేశ్వర్లుకు బాలాజీ పరామర్శ

- శస్త్రచికిత్స అనంతరం నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా

**తెలంగాణ చౌరస్తా, వైరా:**

ఇటీవల గాయపడి శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న ఏన్కూర్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వాసిరెడ్డి వెంకటేశ్వర్లును బీఆర్ఎస్ నాయకుడు బాదావత్ బాలాజీ ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్ల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న బాలాజీ, ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజా సేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా వ్యక్తం చేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో భూక్య బాలాజీ, వీరు నాయక్, వెంకటేశ్వర్లు, భూక్య రామ, రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.



## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- జీవో ఎంఎస్ నెం. 7, 8, 9లను రద్దు చేయాలి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్.

**మేడిపల్లి తెలంగాణ చౌరస్తా :**

ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం ఆర్ట్స్ కాలేజ్ ఆడిటోరియం నుండి కలెక్టరేట్ వరకు సుమారు 3,000 మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించి, విద్యార్థుల సమస్యల పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల సమస్య విద్యారంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందని అన్నారు. గత ప్రభుత్వ కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న సుమారు ₹7,000 కోట్ల బకాయిలకు, అనంతర కాలంలో పేరుకుపోయిన ₹4,000 కోట్లకు పైగా బకాయిలు కలిపి, ప్రస్తుతం ₹11,000 కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద విద్యా శాఖ ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. సమస్యలపై ఎటువంటి సమీక్ష నిర్వహించకుండా లక్షలాది మంది విద్యార్థి జీవితాలతో చెలగాటం ఆడుతున్నాడు. రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయి కానీ సమస్యల పరిష్కారాలు గడప కూడా దాటడం లేదని ఎద్దేవా చేసారు. పేద విద్యార్థుల పట్ల ఏ మాత్రం ప్రేమ, చిత్తశుద్ధి ఉన్న తక్షణమే పెండింగ్ స్కాలర్షిప్స్ , ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## రామన్నపేట సీఐగా మోలుగురి రవి

**రామన్నపేట తెలంగాణ చౌరస్తా:**

రామన్నపేట పోలీస్ నూతన సర్కిల్ ఇన్సపెక్టర్‌గా మోలుగురి రవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల డీటీసీ నుంచి బదిలీపై ఆయన రామన్నపేటకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజల సహకారంతో ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. సమాజానికి విఘాతం కలిగించే వారిపై మరియు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా ఇప్పటివరకు ఇక్కడ



రామన్నపేట సీఐగా పనిచేసిన ఎన్. వెంకటేశ్వర్లు మల్టీజోన్ 2కు బదిలీ అయ్యారు.

# కాంగ్రెస్ అగ్రనేతల అరెస్టు అప్రజాస్వామికం

- నీట్,జెఈఈ పరీక్షల లీకేజ్ పై కేంద్రం బాధ్యత వహించాలి
- తొర్రూరు మున్సిపల్ ఛైర్మన్ తూనం శ్రావణ్ కుమార్





**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:**

నీట్ , జేఈఈ ప్రవేశ పరీక్షల ప్రశ్న పత్రాల లీకేజ్ కి నిరసనగా ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేపట్టిన కాంగ్రెస్ అగ్ర నేతలు, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ,ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున కార్గే, ఎంపీ ప్రియాంక గాంధీ లను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోత్కూరి రవీంద్ర చార్యులు విమర్శించారు.కాంగ్రెస్ అగ్ర నేతల అరెస్టులకు నిరసనగా గురువారం డివిజన్ కేంద్రంలోని గాంధీ సెంటర్ లో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ జేఈఈ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల ప్రశ్న పత్రాల లీకేజ్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో పరీక్షల నిర్వహణపై విద్యార్థులు,యువతలో విశ్వాసం దెబ్బ తిన్నదని విమర్శించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర విద్యా శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ముద్దసాని సురేష్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బి. వెంకన్న యాదవ్, సీనియర్ నాయకులు డాక్టర్ పోనుగోటి సోమేశ్వరరావు, మేకల కుమార్,జక్కుల రామ్ రెడ్డి, చిత్తలూరి శ్రీనివాస్,జలకం శ్రీనివాస్, చెవిటి సుధాకర్,కందాడి అచ్చిరెడ్డి,మహబూబ్ రెడ్డి,రవి నాయక్,గుండాల నర్సయ్య,విక్రమ్ రెడ్డి, సర్పంచ్‌లు బంగారు రమేష్, ఎర్ర వెంకటరెడ్డి, జాటోత్ రాం లాల్, అభిరాం నాయక్, నరేందర్,విజయ రవి, గంగా నరేష్,నాయకులు వెన్నం సోమిరెడ్డి, మిత్తింటి హరీష్,దొంగరి శంకర్, రాజేష్ యాదవ్, ప్రవీణ్ యాదవ్,మహేష్ యాదవ్,బుచ్చి రాజులు, రమేష్ రావు,వి.రాజు, రాంబాబు,అన్వేష్, పరశురాములు,ఎర్రం రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఓయూ డిగ్రీ పరీక్ష ఫలితాలను విడుదల

- ఉత్తీర్ణులైన విద్యార్థులకు శుభాకాంక్షలు
- మార్కుల మెమోలను త్వరలోనే కాలేజ్ లకు పంపిస్తాం
- ఓయూ వీసీ ప్రొ. కుమార్



**తెలంగాణ చౌరస్తా, సికింద్రాబాద్ :**
ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో మే/జూన్ 2026లో నిర్వహించిన బి.ఎ., బి.కామ్., బి.ఎస్సీ., బి.బి.ఎ., బి.ఎస్సీ. (ఆనర్స్) కోర్సుల 4వ, 6వ, సెమిస్టర్స్ పరీక్షల ఫలితాలను ఓయూలో గురువారం వీసీ ప్రొ. కుమార్ విడుదల చేశారు. ఓయూ పరిపాలనా భవన్ లోని ఈసీ హాల్లో జరిగిన ఫలితాల విడుదల కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొ. జి. నరేష్‌రెడ్డి ,ఓఎస్డీ ప్రొ. జితేందర్ కుమార్ నాయక్, పరీక్షల నియంత్రణాధికారి, సోషల్ సైన్సెస్ ఫ్యాకల్టీ డీన్ ప్రొ. బి. సుధాకర్ రెడ్డి తో పాటు అదనపు పరీక్షల నియంత్రణాధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఐదు డిగ్రీ కోర్సుల 4వ, 6వ సెమిస్టర్ (రెగ్యులర్) పరీక్షలకు 1,16,914 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 71,520 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 42,128 మంది విద్యార్థులు డిగ్రీ పూర్తి చేసి అర్హత సాధించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఓయూ వీసీ శుభాకాంక్షలు తెలిపారు. ఫలితాలను సమయానికి విడుదల చేయడానికి సహకరించిన అధ్యాపకులకు, అనుబంధ కళాశాలల యాజమాన్యానికి, పరీక్షల విభాగపు సిబ్బందికి అభినందనలు తెలిపారు.విద్యార్థులు తమ ఫలితాలను ఉస్మానియా యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్ www.osmania.ac.in మరియు పరీక్షా విభాగపు పోర్టల్‌లో చూసుకోవచ్చని సూచించారు. మార్కుల మెమోలను త్వరలోనే ఆయా కళాశాలలకు పంపిస్తామని వెల్లడించింది. రీకౌంటింగ్ రీవాల్యుయేషన్, డూప్లికేట్ మార్కుల మెమోల జారీకి సంబంధించిన పూర్తి వివరాలు, ఫీజు, గడువు తేదీల నోటిఫికేషన్‌ను కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ త్వరలోనే వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారని తెలిపింది. ఎలాంటి సందేహాలున్నా విద్యార్థులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు ,ఓయూ పరీక్షల నియంత్వాధికారి కార్యాలయాన్ని సంప్రదించవలసిందిగా కంట్రోలర్ బ్,డీన్సీ నియర్ ప్రొఫెసర్ బి. సుధాకర్ రెడ్డి కోరారు.



# మాజీ మంత్రి కేటీఆర్ ముందస్తు జన్మదిన వేడుకలు

- బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. చిరుమల్ల రాకేష్ కుమార్ ఆధ్వర్యంలో
- ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ

**పెద్దపల్లి /సుల్తానాబాద్, తెలంగాణ చౌరస్తా :**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ 50వ ముందస్తు జన్మదిన వేడుకలను గురువారం బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా జరిపారు. పెద్దపల్లి, సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. టీఎస్ టీఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. చిరుమల్ల రాకేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్ ప్రజాసేవ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని పార్టీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. సమాజసేవే కేటీఆర్ జన్మదిన వేడుకల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఢిల్లీలో నీట్ విద్యార్థులపై జరిగిన పోలీస్ చర్యను నిరసిస్తూ.. శుక్రవారం ఉదయం హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించమన్నారు. ఈ పోరాటానికి మద్దతుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, మోబిన్, మాజీ కౌన్సిలర్లు బిక్షపతి, స్వామి, సంపత్, ఉపసర్పంచ్ కుమార్ యాదవ్, సుల్తానాబాద్ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పారుపల్లి గుణపతి, బీఆర్ఎస్ నాయకులు జూపల్లి సందీప్ రావు, దయాకర్, సూర శ్యామ్, ఉప్పు శివకుమార్, దేవేందర్ రెడ్డి, పడాల సతీష్ గౌడ్, మల్లికార్జున్, బండి సంపత్, పెంచాల శ్రీకాంత్, బోయిని మనోజ్, దాసరి సతీష్, నాగరాజు, రాజకుమార్, వెంకటేష్, స్వామి దాస్, చొప్పరి అరుణ్ కుమార్, రామకృష్ణ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్వీయ సంరక్షణ దినోత్సవం

- 108 ఈఎంఆర్ఐ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు




**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:**
అంతర్జాతీయ స్థాయిలో ప్రతి సంవత్సరం జూలై 24న అంతర్జాతీయ స్వీయ సంరక్షణ దినోత్సవం నిర్వహించబడుతుంది.ఈ సందర్భంగా 108 ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ప్రజలకు స్వీయ సంరక్షణపై అవగాహన కల్పిస్తోంది.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర 108 అంబులెన్స్ సేవల కార్య నిర్వాహణ అధికారి బి.సుధాకర్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారం,క్రమం తప్పని వ్యాయామం,ఆరోగ్య పరీక్షలు,మానసిక ప్రశాంతత వంటి అలవాట్లు గుండె జబ్బులు,స్ట్రోక్ వంటి వ్యాధులను నివారించడంలో కీలకమని తెలిపారు.ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోండి.రోజూ కనీసం 30 నిమిషాలు నడవండి.పొగాకు,మద్యానికి దూరంగా ఉండండి.క్రమం తప్పకుండా బిపి,షుగర్ పరీక్షలు చేయించుకోండి. ధ్యానం,తగినంత నిద్రకు ప్రాధాన్యం ఇవ్వండి.అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 108కు కాల్ చేయండి.సమయానికి వైద్య సేవలు పొందడం కూడా స్వీయ సంరక్షణలో ఒక ముఖ్యమైన భాగం అని తెలిపారు.ప్రపంచ ఆరోగ్య సంరక్షణ వ్యూహాలలో స్వీయ సంరక్షణను ఒక కీలక అంశంగా ప్రోత్సహిస్తుందన్నారు.స్వీయ సంరక్షణే ఆరోగ్యవంతమైన జీవితానికి మొదటి అడుగు అని పేర్కొన్నారు.

# కాక్రోచ్‌ల నిరసన ప్రదర్శనలు హర్షణీయం

- కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి
- రాహుల్ గాంధీ,అఖిలేష్ యాదవ్ అరెస్టు అప్రజాస్వామికం
- సమాజ్ వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి.



**తెలంగాణ చౌరస్తా, సికింద్రాబాద్ :**
విద్యార్థులు, యువకులు, కుటుంబాలు, ప్రతిపక్ష పార్టీలు విద్యావ్యవస్థలో జరుగుతున్న అక్రమాలకు వ్యతిరేకంగా జంతర్ మంతర్ లో వేలల్లో, లక్షల్లో గత ఐదు రోజులుగా ప్రదర్శనలు అవుతున్నాయి. పేపర్ లీక్ లకు వ్యతిరేకంగా కేంద్ర విద్యా మంత్రి రాజీనామా చేయాలని దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయి. బాధ్యత రైత బిజెపి పాలన భారత ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నయని సమాజ్ వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి అన్నారు. సోనం వాంగ్చుక్ 26 రోజులుగా సాగుతున్న నిరాహార దీక్ష భారత దేశ ఆత్మను కదిలించింది. గురువారం యువకులు, విద్యార్థులు దేశంలోని పలు ప్రాంతాలలో నిరసన ప్రదర్శనలు కొనసాగిస్తున్నారు. పిల్లలతో పాటు తల్లిదండ్రులు కూడా నిరసనలో పాల్గొనడం గొప్ప పరిణామంగా పేర్కొన్నారు.బిజెపి పాలన కచ్చితంగా విద్యార్థి, యువజన వ్యతిరేక పాలనగా ప్రజలు భావిస్తున్నారని అన్నారు. యువకుల ఉద్యమాన్ని సమాజ్వాది పార్టీ పూర్తిగా మద్దతిస్తుందని తెలియజేశారు




# రెడ్డిగూడెంలో ముందస్తు కేటీఆర్ జన్మదిన వేడుకలు

- గిఫ్ట్ ఏ స్మైల్'లో భాగంగా గిరిజనులకు నాణ్యమైన వైద్య సేవలు
- వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యేలు
- జనసందోహంగా మారిన మెగా హెల్త్ క్యాంప్
- ఉచితంగా మందులు, పండ్ల పంపిణీ
- పల్లెలు, తండాలను అభివృద్ధి చేసిన ఘనత కేటీఆర్‌దే
- డాక్టర్ ఉదయ జ్యోతి
- ప్రజాసేవే కేటీఆర్‌కు అసలైన కానుక
- బీఆర్ఎస్ నాయకురాలు కాసాని నాగ శేష పద్మ

**అశ్వారావుపేట తెలంగాణ చౌరస్తా:**
బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదినం (జూలై 24) సందర్భంగా, ఒక రోజు ముందుగానే జూలై 23న అశ్వారావుపేట మండలం, రెడ్డిగూడెం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వెన్నెల హాస్పిటల్ సౌజన్యంతో భారీ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు తాటి వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావు, వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చంద్రావతి హాజరై, ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ భూక్యా ప్రసాద్ రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాసాని చంద్రమోహన్ సహకారంతో ఈ శిబిరం సాగింది. ఈ శిబిరంలో నిపుణులైన వైద్యులు డాక్టర్ ఉదయ జ్యోతి, డాక్టర్ భూక్యా ప్రసాద్ రావు, డాక్టర్ చంద్రావతి, డాక్టర్ పూర్ణచంద్ పాల్గొని రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు, పండ్లు పంపిణీ చేశారు. రెడ్డిగూడెంతో పాటు పరిసర ప్రాంతాలైన సుద్దగోతులగూడెం, తోగ్గుడెం, తిరుమలకుంట, పాకాలగూడెం తదితర గ్రామాల నుండి వందలాది మంది గిరిజనులు, వృద్ధులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. అనంతరం నాయకులు కేక్ కట్ చేసి కేటీఆర్ ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి జుజ్జురపు శ్రీరామమూర్తి, మాజీ టౌన్ ప్రెసిడెంట్ సత్యవరపు సంపూర్ణ, సీనియర్ నాయకులు బిర్రం వెంకటేశ్వరరావు ముఖ్య పాత్ర పోషించారు. పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి రెండింటిలోనూ కేటీఆర్ చూపించిన చొరవ అసాధారణమని, మారుమూల గ్రామాలు, తండాలను పంచాయతీలుగా మార్చి వాటి దశాదిశను మార్చిన ఘనత ఆయనకే దక్కుతుందని డాక్టర్ ఉదయ జ్యోతి పేర్కొన్నారు. ప్రస్తుత పాలనలో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అందుకే 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని, రాబోయే రోజుల్లో ప్రతి నెలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డి.కె.ఎమ్. మహిపాల్, కోటగిరి సీతారామస్వామి, రావు జోగేశ్వరరావు, జుజ్జూపల్లి రమణరావు, జుజ్జురు వెంకన్నబాబు, మోహన్ రెడ్డి, సంక ప్రసాద్, చిన్నశెట్టి నరసింహం, చందా లక్ష్మీ నర్సయ్య, గూడవర్తి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు నారం రాజశేఖర్, సాధు జ్యోత్స్న, రఘురాం, అప్పారావు, ఏసు, గంగాధర్, తగరం హరి, అనిల్ తదితరులు పాల్గొన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినందుకు స్థానిక ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# అశ్వారావుపేటలో పోలీసుల విస్తృత తనిఖీలు

- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
- జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాలతో
- అశ్వారావుపేటలో నాకాబందీ... 256 వాహనాలు తనిఖీ

**అశ్వారావుపేట తెలంగాణ చౌరస్తా:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ బి. రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు అశ్వారావుపేట ఉపపరిశోధకులు (ఎస్సై) టి. యయాతి రాజు మరియు సిబ్బంది స్థానిక కూడలి వద్ద విస్తృతంగా వాహనాల నిలిపివేత, తనిఖీలు నిర్వహించారు. ఈ ప్రత్యేక తనిఖీలు ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు కొనసాగాయి. తనిఖీల్లో భాగంగా రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనాలను నిలిపి నిశితంగా పరిశీలించారు. మొత్తం 256 వాహనాలను సోదా చేయగా, సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు.ఇందులో వాహన నడపడ పత్రం (డ్రైవింగ్ లైసెన్స్) లేని 34 ద్విచక్ర వాహనాలు, సరైన సంఖ్యా ఫలకం (నంబర్ ప్లేట్) లేని 16 వాహనాలు, సీటు బెల్టు ధరించని 7 కార్ల చోదకులు, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపిన ఒకరిపై చర్యలు తీసుకున్నారు. అలాగే గతంలో విధించిన 78 జరిమానాలను వసూలు చేశారు. సరైన పత్రాలు లేని 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రవాణా నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో అశ్వారావుపేట పోలీసు స్టేషన్ అధికారి టి. యయాతి రాజుతో పాటు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.





# ఏఐఎఫ్ బీ పెద్దపల్లి టౌన్ కన్వీనర్‌గా కుక్క శ్రావణ్ కుమార్

**పెద్దపల్లి,తెలంగాణ చౌరస్తా :**
ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పెద్దపల్లి పట్టణ కన్వీనర్‌గా కుక్క శ్రావణ్ కుమార్ నియామకయ్యారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రజాసేవ పట్ల ఆయనకు ఉన్న అంకితభావాన్ని గుర్తించిన జిల్లా కమిటీ ఈ మేరకు నియామకం చేపట్టింది. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. నూతన టౌన్ కన్వీనర్‌గా ఎన్నికైన శ్రావణ్ కుమార్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలను పట్టణంలోని ప్రతి ఇంటికి తీసుకెళ్లడంతో పాటు, అన్ని వార్డుల్లో పార్టీ కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేసి యువతను పార్టీ కార్యకలాపాల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. అదేవిధంగా, పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజా పోరాటాలు నిర్వహిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని జిల్లా కమిటీ ఆదేశించింది. కుక్క శ్రావణ్ కుమార్ నాయకత్వంలో పెద్దపల్లి పట్టణంలో పార్టీ మరింత విస్తరించి, ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా కమిటీ ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. తనను నమ్మి అవకాశం ఇచ్చిన జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పెద్దపల్లిలో వచ్చేది బహుజన రాజ్యమేనని, అని దానికోసం పార్టీ కార్యకర్తలను కలుపుకుపోయి పార్టీ విస్తరణకు కృషి చేస్తానన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలపై పర్యవేక్షణ ఎక్కడ...?


- భద్రాద్రి కొత్తగూడెం విద్యాశాఖలో మామూళ్ల పర్వం?
- నిబంధనలు గాలికొదిలేసి కార్పొరేషన్ పరిధిలో వెలిసిన ప్రైవేటు పాఠశాలలు...
- కనీస పర్యవేక్షణ లేని ఎంఈఓ, డీఈఓ వైఖరిపై తీవ్ర నిరసనలు










**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా:**
కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో ప్రైవేటు విద్యా సంస్థల అరాచకాలు హద్దులు మీరుతున్నాయి. విద్యను వ్యాపారంగా మార్చేసి, విద్యాశాఖ నిబంధనలను బొందపెడుతూ అమాయక విద్యార్థుల భవిష్యత్తుతో ప్రైవేటు యాజమాన్యాలు చెలగాట మాడుతున్నాయి. కంటిముందే అక్రమాలు జరుగుతున్నా మండల విద్యాశాఖాధికారి (ఎంఈ ఓ), జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) నిద్రమత్తులో జోగుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఒకే పరిధిలో పక్కపక్కనే వెలిసిన శ్రీ రాగా పాఠశాల, ఎస్.ఆర్.కె.టి పాఠశాలల వ్యవహారం ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా తీవ్ర సంచలనంగా మారింది.

**శ్రీ రాగా పాఠశాల నామ్‌కే వాస్తే పర్మిషన్లు... నరకకూపంలో విద్యార్థులు!**
శ్రీ రాగా పాఠశాల నిర్వహణ తీరు విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది. పాఠశాల అంటే కనీసం ఉండాల్సిన ఆటస్థలం (ప్లే గ్రౌండ్) ఇక్కడ అంగుళం కూడా కానరాదు. సరిపడా స్థలం లేకపోవడంతో విద్యార్థులు ఆటపాటలకు పూర్తిగా దూరమై, కేవలం నాలుగు గోడల మధ్య బందీలుగా మారుతున్నారు. ఇరుకుగా ఉండే తరగతి గదుల్లో పిల్లలను కోళ్లఫారమ్‌లా కుక్కుతుండటంతో కనీస గాలి, వెలుతురు (వెంటిలేషన్) అందక తీవ్ర మానసిక, శారీరక ఇబ్బందులకు గురవుతున్నారు. కేవలం పేరుకే అనుమతులు తెచ్చుకుని, పాఠశాల భవనానికి ఉండాల్సిన కనీస విస్తీర్ణ నిబంధనలను గాలికొదిలేశారు. అసలు ఈ భవనానికి విద్యాశాఖ అనుమతులు ఉండి ఇచ్చిందా, లేక కాగితాల మీద చూపిస్తూ విద్యార్థుల జీవితాలతో వ్యాపారం చేస్తోందో విచారణ జరగాల్సి ఉంది.

**ఎస్.ఆర్.కె.టి పాఠశాల కోర్టులో స్థలం కేసు... రేపు తాళాలు వేస్తే పిల్లల భవిష్యత్తు ఏంటి?**
మరోవైపు ఎస్.ఆర్.కె.టి పాఠశాల వ్యవహారం మరింత తీవ్ర గందరగోళానికి దారితీస్తోంది. ఈ పాఠశాల నిర్వహిస్తున్న విద్యా స్థలం, భవనంపై ఇప్పటికే న్యాయస్థానంలో తీవ్రమైన ఆస్తి వివాదపు కేసు నడుస్తోంది. కోర్టు పరిధిలో ఉన్న వివాదాస్పద భవనానికి విద్యాశాఖ అధికారులు ఏ ధైర్యంతో, ఏ ప్రాతిపదికన పాఠశాల నిర్వహణకు అనుమతులు మంజూరు చేశారనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నావళిగా మారింది. రేపు పొద్దున కోర్టు తీర్పు ప్రతికూలంగా వచ్చి, భవనానికి అధికారులు లేదా పోలీసులు తాళాలు వేస్తే... అందులో చదువుతున్న వందలాది మంది అమాయక విద్యార్థుల భవిష్యత్తు ఏ కావాలి? వారిని ఏ బడికి పంపుతారు? ఈ ప్రశ్నకు యాజమాన్యం వద్ద కానీ, అనుమతులిచ్చిన అధికారుల వద్ద కానీ సమాధానం లేదు.

**రొదలో పాఠాలు... ఆటంకంలో విద్యార్థుల ఏకాగ్రత!**
ఈ రెండు పాఠశాలలు కనీస దూరం లేకుండా పక్కపక్క భవనాల్లోనే నిర్వహించడం వల్ల తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయి. ఉదయం పాఠశాల ప్రారంభమైనప్పటి నుంచి తరగతులు ముగిసేవరకు ఒక పాఠశాలలోని ఉపాధ్యాయుల బోధనలు, విద్యార్థుల అరుపులు, కేకలు పక్కనే ఉన్న మరో పాఠశాల క్లాస్ రూమ్‌లలోకి స్పష్టంగా వినపడుతున్నాయి. దీనివల్ల రెండు పాఠశాలల్లోని విద్యార్థులు తీవ్ర గందరగోళానికి గురవుతూ, ఏకాగ్రత కోల్పోయి చదువులో వెనుకబడిపోతున్నారు. అసలు పక్కపక్కనే రెండు ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు ఇవ్వకూడదనే కనీస జ్ఞానం విద్యాశాఖ అధికారులకు లేదా అని స్థానికులు మండిపడుతున్నారు.

**ఎంఈఓ, డీఈఓల నిద్రావస్థ... కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకోవాలి!**
గత రెండు సంవత్సరాలుగా ఈ రెండు పాఠశాలల్లో బహిరంగంగా విద్యా వ్యాపారం సాగుతున్నప్పటికీ, స్థానిక ఎంఈఓ కన్నుతెరిచి చూడకపోవడం వెనుక పెద్ద ఎత్తున 'మామూళ్ల' బంధం ఉందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. నిబంధనలు ఉల్లంఘిస్తున్నా చర్యలు తీసుకోకపోవడం అధికారుల పనితీరుపై అనుమానాలను బలపరుస్తోంది. అమాయక విద్యార్థుల జీవితాలతో, తల్లిదండ్రుల కష్టార్జితంతో చెలగాటమాడుతున్న శ్రీ రాగా, ఎస్.ఆర్.కె.టి పాఠశాలల అక్రమాలపై జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకోవాలి. క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపించి, నిబంధనలు గాలికొదిలేసిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, వీటికి అక్రమంగా అనుమతులు కట్టబెట్టిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.

# అవినీతిని ప్రశ్నిస్తే దేశద్రోహులా

- మద్దూర్ అంబేద్కర్ యువజన సంఘం

**మద్దూర్,తెలంగాణ చౌరస్తా :**
నీట్ పేపర్ లీక్ కి కారకుడైన కేంద్ర విద్యాశాఖ మంత్రి అమరేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని మద్దూర్ మండల అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉదయం అంబేద్కర్ చౌరస్తా దగ్గర రాస్తారోకో నిర్వహించారు.అనంతరం అంబేద్కర్ యువజన సంఘం మండల నాయకులు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం దాదాపు పది సంవత్సరాల నుండి 150 సార్లకు పైగా అన్ని పరీక్షలలో పేపర్ లీక్ చేసి,ఇటీవలి నీట్ పరీక్షల్లో 14 మంది విద్యార్థుల ఆత్మహత్యకు కారకులైన బిజెపి పార్టీ కేంద్ర విద్యా శాఖ మంత్రి అమరేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని,దేశంలో విద్యా వ్యవస్థను నాశనం చేశారని మండిపడ్డారు.ఇదే విషయమై డిల్లీ జంతర్ మంతర్లో శాంతియుత ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులను దేశ ఉగ్రవాదులుగా పోల్చడం ఏంటని ప్రశ్నించారు.దేశంలో అవినీతిని ప్రశ్నిస్తే ఉగ్రవాదులుగా,దేశద్రోహులుగా చిత్రీకరించడం బిజెపికి అలవాటుగా మారిపోయిందని ఎద్దేవా చేశారు.అంబేద్కర్ సంఘం యువ నాయకుడు విజయ్ మాట్లాడుతూ ఇలాంటి వైఖరిని మీరు మార్చుకోకపోతే ఈ దేశ యువత మీకు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు.

# మేం చమురు విక్రయించకపోతే ఇంకెవరూ అమ్మలేరు

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో**

అమెరికా, ఇరాన్ మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరుకుంటోంది. హర్మూజ్ జలసంధిలో నౌకలపై ఇరాన్ దాడి చేసిన ప్రతిసారీ ఇరాన్‌కు చెందిన ఒక వంతెన లేదా విద్యుత్ కేంద్రాన్ని ధ్వంసం చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలపై ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘర్ ఘాలిబాఫ్ దీటుగా స్పందించారు. తమ దేశ భద్రతకు ముప్పు వాటిల్లితే, గల్ఫ్ ప్రాంతంలోని మౌలిక సదుపాయాలు ఏవీ సురక్షితంగా ఉండవని స్పష్టం చేశారు. అమెరికా బలగాలు ఈ ప్రాంతం నుంచి వెళ్లిపోతేనే వ్యూహాత్మక హర్మూజ్ జలసంధిలో భద్రత ఉంటుందని తేల్చి చెప్పారు. ఒకవేళ తమ ఇంధన ఎగుమతులను అడ్డుకుంటే, మొత్తం గల్ఫ్ ప్రాంతానికే దాని తీవ్రత తగులుతుందని స్పష్టం చేశారు. మరోవైపు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ కూడా అమెరికా వ్యాఖ్యలపై ఘాటుగానే స్పందించారు. తమ రక్షణ సిద్ధాంతం కంటికి కన్ను ఆధారంగా పనిచేస్తుందని, తమ మౌలిక సదుపాయాలపై ఎలాంటి దురాక్రమణ జరిగినా అత్యంత శక్తివంతంగా, నిర్ణయాత్మకంగా బదులిస్తామని వార్నింగ్ ఇచ్చారు.

**100 డాలర్లకు బ్యారల్ ముడి చమురు ధర**

ఇక, ఇరాన్ తాజా హెచ్చరికలతో అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో వణుకు మొదలైంది. హర్మూజ్ జలసంధి గుండా చమురు ఎగుమతులకు ఆటంకం కలుగుతుందన్న ఆందోళనలతో క్రూడాయిల్ ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఆరు వారాల గరిష్ఠానికి ఈ ధరలు చేరుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారల్ ముడి చమురు ధర మళ్లీ 100 డాలర్ల దిశగా సాగుతోంది. గురువారం ఉదయం బ్యారెల్ ధర 1.5 శాతానికి పైగా పెరిగి 95 డాలర్లు దాటి ట్రేడ్ అవుతోంది. మరోవైపు, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడ్ బ్యారెల్ ధర 88 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఈ ఒక్క నెలలో బ్రెంట్ క్రూడ్ ధర ఇప్పటివరకు దాదాపు 30 శాతం పెరగడం గమనార్హం. ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే చమురు మంటలు మరింత పెరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇరాన్ మద్దతు ఉన్న హూతీ రెబల్స్ సైతం రంగంలోకి దిగడం ఆందోళనలను మరింత పెంచుతోంది. బాబ్ ఎల్‌మాండెబ్ జలసంధి గుండా వెళ్లే సౌదీ అరేబియా చమురు నౌకలే లక్ష్యంగా హూతీలు దాడులకు పాల్పడ్డారు. ఈ రెండు కీలక జలసంధుల్లో ఒకేసారి అంతరాయం ఏర్పడితే, ప్రపంచ ఇంధన మార్కెట్లకు ఇది మునుపెన్నడూ లేని భారీ ముప్పును తెస్తుందని మార్కెట్ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**సౌదీ చమురు ట్యాంకర్లపై హూతీల దాడి**

ఇదిలా ఉండగా, అమెరికా ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం ఎర్ర సముద్రానికి కూడా పాకింది. యెమెన్‌కు చెందిన హూతీ రెబల్స్ 'ఎన్సెలియా', 'లైలా' అనే రెండు సౌదీ ఆయిల్ ట్యాంకర్లపై దాడి చేశాయి. బాబ్ ఎల్‌మాండెబ్ జలసంధి గుండా వెళ్లే సౌదీ నౌకలపై దిగ్బంధనం విధించినట్లు ప్రకటించిన హూతీలు, ఈ దాడులకు పాల్పడ్డారు. 'ఎన్సెలియా' నౌకపై గుర్తుతెలియని ప్రొజెక్టైల్ దాడి చేయడంతో మంటలు చెలరేగాయని, అయితే ప్రాణనష్టం జరగలేదని సౌదీ వర్గాలు, బ్రిటన్‌కు చెందిన మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ ధ్రువీకరించాయి. ఎర్ర సముద్రాన్ని, గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌తో బాబ్ ఎల్ మాండెబ్ జలసంధి కలుపుతుంది. ప్రపంచ వాణిజ్య రవాణాలో 12 శాతం దీని గుండా సాగుతోంది. మరోవైపు, అమెరికా బలగాలు ఇరాన్‌పై దాడులను మరింత ఉధృతం చేశాయి. వరుసగా 12వ రాత్రి కూడా ఇరాన్ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా విరుచుకుపడ్డాయి. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు చేసే సామర్థ్యాన్ని దెబ్బతీయడమే తమ లక్ష్యమని అమెరికా సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది. హర్మూజ్ జలసంధిలో నౌకలపై ఇరాన్ దాడి చేసిన ప్రతిసారీ ఇరాన్‌కు చెందిన ఒక వంతెనను లేదా విద్యుత్ కేంద్రాన్ని ధ్వంసం చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. ఈ యుద్ధం వల్ల అగ్రరాజ్యానికి భారీగానే ఖర్చవుతోంది. ఇప్పటివరకు యుద్ధం కోసం 37.5 బిలియన్ డాలర్లు ఖర్చు చేసినట్లు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ సెనేట్ విచారణలో వెల్లడించారు. తాజా దాడులతో అహ్వాజ్, రమ్‌షీర్, అండిమెష్క్ తదితర ప్రాంతాలపై అమెరికా క్షిపణులు విరుచుకుపడగా ఇరాక్ సరిహద్దులోని షలాంచే పట్టణంలో ఇద్దరు మృతి చెందారు. దౌత్యపరమైన చర్చలకు అవకాశాలు ఉన్నాయని పాకిస్థాన్, తుర్కియే లాంటి దేశాలు ప్రయత్నిస్తున్నప్పటికీ, ఇరాన్ చర్చల పట్ల సీరియస్‌గా లేదని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పెదవివిరిచారు. ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇరు దేశాలు వెనక్కి తగ్గకపోవడంతో వాణిజ్య మార్గాలు మూతపడి ప్రపంచవ్యాప్తంగా పెను ఆర్థిక సంక్షోభం వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

# విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం

**కరీంనగర్, తెలంగాణ చౌరస్తా:**

శాతవాహన యూనివర్సిటీ ఆవరణలో బిఆర్ఎస్వీ యూనివర్సిటీ ఇంచార్జ్ చుక్క శ్రీనివాస్ మాట్లాడుతూ...దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీ పైన విద్యార్థులు యువత కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని ఉద్యమాలు చేస్తా ఉంటే బిజెపి ప్రభుత్వం పోలీసులతో విద్యార్థుల పై దౌర్జన్యం చేస్తుంటే కారే ప్రతి రక్తం బొట్టు కూడా విద్యార్థుల బాధలను చూడలేక రక్తం కారేది విద్యార్థి శరీరం నుండి కాదు ఈ దేశ ప్రజాస్వామ్యం నుండి పోలీసుల లాటీలు ఎముకలను విరగొట్టగలవు కానీ ఆశయాలను కాదు పోలీసుల బూట్లు శరీరాన్ని తొక్కగలవు కానీ చరిత్రను కాదు జంతర్ మంతర్ లో ప్రతి విద్యార్థికి తగిలిన ప్రతి గాయం ఒక ఉద్యమం అవుతుంది.ప్రతి విద్యార్థి యొక్క ప్రతి రక్తం చుక్క వెయ్యి తిరుగుబాటులకు నాంది పలుకుతుంది దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ నిశ్శబ్దంగా లేదు అది విద్యార్థి ఉద్యమ పోరాట గీతం పాడుతుంది దేశవ్యాప్తంగా దేశంలోని విద్యార్థుల గుండెల్లో అగ్ని కణాలను రాజేస్తుంది గుర్తుంచుకోండి అణిచివేత ఎంత పెరిగితే ప్రతిఘటన అంత ఎత్తుకు ఎగిసిపడుతుంది రక్తం ఎంత కారితే విద్యార్థి ఉద్యమం దేశవ్యాప్తంగా అంతే వేగంగా నడుస్తుంది జాగ్రత్త యువత రక్తంతో తడిసిన నేలపై చరిత్ర ఎప్పుడు నియంతలకు విజయగాతలు రాయలేదు దేశ ప్రధాని గారు ప్రతి మాటకు యువత అంటాడు ఇదే యువతను దేశ రాజధానిలో యువత రక్తం కళ్ళ చూస్తున్నాడు మొన్న దేశ రాజధాని ఢిల్లీలో రగిలిన విద్యార్థి రణం నేడు ప్రతి రాష్ట్రం ప్రతి జిల్లా వ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలకు శ్రీకారం చుడుతుంది దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు లోకమంతా ఒక్క తాటిపై నడుస్తుంది ఖబర్దార్ విద్యార్థులు నీట్ పేపర్ లీకేజీ కి బాధ్యతగా మంత్రిని రాజీనామా చేయమంటే రాజీనామా చేయించకుండా విద్యార్థులను అణిచివేయాలని చూస్తున్న బిజెపి ప్రభుత్వం మీ పైన యుద్ధం తిరుగుబాటు దేశవ్యాప్తంగా మొదలైంది కాస్కోండి విద్యార్థి యువశక్తిని తిరగబాటు చేస్తే ఎలా ఉంటుందో ఈ ఉద్యమం మరొక్కసారి దేశవ్యాప్తంగా చూపించడానికి విద్యార్థి లోకమంతా సిద్ధమయింది.

# సీజేపీ ఆందోళనపై కేంద్రం ఉక్కుపాదం

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**

నీట్ పేపర్ లీక్, సీబీఎస్ఈలో అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన ఆందోళనపై ఉక్కుపాదం మోపేందుకు కేంద్రం సిద్ధమైంది. దేశ రక్షణగా మారిన యువత, విద్యార్థుల నిరసనలను అణచివేసేందుకు ఢిల్లీలో జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ)ను అమలు చేయనుంది. దీని ద్వారా ప్రజలను నిర్దిష్ట కాలం(మూడు నెలలు) పాటు, నిరసనకారులను ఎటువంటి విచారణ లేకుండా ఏడాది పాటు నిర్బంధించేందుకు ఢిల్లీ (మొదటిపేజీ తరువాయి)పోలీసులకు ప్రత్యేక అధికారాన్ని కల్పించింది. దీనికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ ను లెఫ్టినెంట్ గవర్నర్ గురువారం విడుదల చేశారు. దీంతో ఢిల్లీలో నిరసనలో పాల్గొన్న వారితో పాటు, నిరసనల అనంతరం తిరిగి వస్తున్న వారిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకోవడం ప్రారంభించారు. అయితే ఇది ఒక సాధారణ చర్య మాత్రమేనని పోలీసులు తెలిపారు. అణచివేతకు ముమ్మరమైన చర్యలుఢిల్లీలో కొనసాగుతున్న నిరసనలను అణచివేసేందుకు ప్రయత్నాలు జోరందుకున్నాయి. ఇప్పటికే సెంట్రల్ ఢిల్లీలో నిలిపివేసిన ఇంటర్నెట్ సేవలు ఇంకా పునరుద్ధరించలేదు. వరుసగా రెండో రోజూ 16 మెట్రో స్టేషన్లను మూసివేశారు. అంతేకాక ఢిల్లీలోని ఓ ముఖ్యమైన వాణిజ్య కేంద్రమైన కన్నాట్ ప్లేస్‌లో దుకాణాలను మూసివేయాలని కేంద్రం నిర్ణయించింది. గురువారం ఉదయం 6.30 గంటల నుంచే దుకాణాలను మూసి ఉంచాలని బీజేపీ పాలిత మున్సిపల్ కార్పొరేషన్ ఆదేశించింది. జనపథ్‌లోని చాలా దుకాణాలు అప్పటికే మూతపడ్డాయి. సాయంత్రం 4 గంటల నుంచి ఆ ప్రాంతంలో ఆంక్షలు విధించారు. జంతర్ మంతర్ నుంచి 1.5 కిలోమీటర్ల వరకూ మొబైల్, ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేశారు. అర్ధరాత్రి 12 గంటల వరకు ఆ ఆంక్షలు అమలులో ఉంటాయని పోలీసులు తెలిపారు.అదే విధంగా నగరంలోని అన్ని ప్రధాన రహదారులపై భారీ ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దేశ రాజధానిలో బారికేడ్లు, భద్రతా సిబ్బందితో నిండిపోయాయి. మరోపక్క జంతర్‌మంతర్ వద్ద ఆందోళన ప్రదేశంలో విద్యార్థులు, యువ నిరసనకారులకు మద్దతు పెరుగుతోంది. ఒక్కసారిగా పదివేల మందికి పైగా యువత , విద్యార్థులు అక్కడికి తరలిరావడంతో కేంద్ర ఎత్తుగడలన్నీ తలకిందులవుతున్నాయి. రైతుల సమ్మె సమయంలోనూ ప్రభుత్వం ఇలాంటి ఎత్తుగడలకే ప్రయత్నించింది. సీజేపీపై ఎన్ఐఏ విచారణకు సంఘ్‌పరివార్ పిటిషన్‌సీజేపీ చేపట్టిన నిరసనపై ఎన్ఐఏ విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ సంఘ్ పరివార్ మద్దతుదారులు ఢిల్లీ కోర్టులో పిటిషన్ వేశారు. అయితే ఈ పిటిషన్ అత్యంత అనుమానాస్పదంగా ఉందని ఈ సందర్భంగా సీజేపీ పేర్కొంది. "ఈ ప్రభుత్వ చేతుల్లో ఆయుధాలుగా మారడానికి న్యాయస్థానాలు అనుమతించవద్దని మేము విజ్ఞప్తి చేస్తున్నాం. యువతరం మొత్తం వారివైపే చూస్తోంది. సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యంపై దాఖలైన ఒక సాధారణ పిటిషన్ కేసులో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుతో ప్రభుత్వం ఆయనను బలవంతంగా ఆస్పత్రిలో చేర్చి నిర్బంధించేందుకు ఉపయోగించుకుంది. అది నిరసనను మరింతగా రెచ్చగొట్టింది. నిరసనకారులతో చర్చలు జరపడానికి బదులుగా, ప్రభుత్వం ఈ పిటిషన్‌ను, న్యాయస్థానాన్ని ఉపయోగించి నిరసనకారులను, విద్యార్థులను, యువతరాన్ని రాక్షసులుగా చిత్రీకరిస్తోంది. అధికారంలో ఉన్న ప్రభుత్వం ఇటువంటి దుర్మార్గపు, కుటిలమైన కుట్రలో న్యాయస్థానాన్ని భాగస్వామిగా చేయకూడదు. సంస్థలపై విశ్వాసం ముఖ్యం. వాటిని ఏ విధంగానూ రాజకీయాకరించవద్దు. ఆయుధాలుగా వాడుకోవద్దు" అని కోరింది.చర్చలు తటస్థ వేదిక వద్ద జరగాలిసీజేపీ ఆందోళన ఉధృతం కావడంతో ప్రభుత్వం నిరసనకారులను చర్చల కోసం కేంద్ర మంత్రి జెపి నడ్డా కార్యాలయానికి ఆహ్వానించింది. అయితే, తటస్థ వేదిక వద్దకు ఆహ్వానిస్తే మాత్రమే చర్చల్లో పాల్గొంటామని చెబుతూ సీజేపీ ఆ ఆహ్వానాన్ని తిరస్కరించింది. మరోపక్క సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన దీక్ష 26వ రోజుకు చేరుకుంది. అదే విధంగా సీజేపీ చేపట్టిన ఆందోళన 34వ రోజూ కొనసాగింది. మహిళా సంఘాలు, సీఐటీయూ నాయకులు వీరి నిరసనకు తమ మద్దతును తెలియజేయడానికి జంతర్ మంతర్‌కు చేరుకున్నారు.జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ, బాలీవుడ్ నటి హుమా ఖురేషీ సంఘీభావం తెలిపారు. సినీ నటులు ఆలియా భట్, షారుక్ ఖాన్, మాధవన్, కరీనా కపూర్, ఈషా రెబ్బ, క్రికెటర్లు శిఖర్‌దావన్, యువరాజ్ సింగ్, ఒలింపిక్ స్వర్ణ విజేత అభినవ్ బింద్రా సోషల్ మీడియా వేదికగా ఆందోళనకు మద్దతు ప్రకటించారు. ఢిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులకు మద్దతుగా సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే మహారాష్ట్రలోని అహిల్యానగర్‌లో రెండు గంటల పాటు మౌన దీక్ష చేపట్టారు. నీట్ పేపర్ లీక్ తరువాత ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులను ప్రతిపక్ష నేతలు స్మరించుకుని నివాళి అర్పించారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి : అభిజీత్ దీప్కే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని ప్రధాని మోడీని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే గురువారం మరోసారి కోరారు. కేంద్రం స్పందించని పక్షంలో ఈ రాజీనామాల పర్వం ప్రధాని మోడీ వరకూ చేరుతుందని వ్యాఖ్యానించారు.

**నేడు దేశవ్యాప్త ఆందోళనలకు సీజేపీ పిలుపు**

నీట్ పేపర్ లీక్‌కు కేంద్రం బాధ్యత వహించాలంటూ ఉద్యమిస్తున్న సీజేపీ, విద్యార్థి సంఘాలు నేడు దేశవ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చాయి. ఇటీవల జంతర్‌మంతర్‌పార్లమెంటు ర్యాలీ సందర్భంగా యువతపై పోలీసుల కర్కశత్వాన్ని వ్యతిరేకిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఈ నిరసన కార్యక్రమానికి కావాల్సిన అనుమతులు పొందేందుకు, ఏర్పాట్లు చేసేందుకు విద్యార్థి సంఘాలు, యూత్ ఆర్గనైజేషన్లు కలిసి పనిచేయాలని సీజేపీ సూచించింది.



# మహిళల కోరిక మేరకు ముప్పిరితోటకు బస్సు

- ప్రభుత్వ విప్ విజయరమణారావు.

**పెద్దపల్లి,తెలంగాణ చౌరస్తా:**

రెండున్నర ఏళ్ల క్రితం ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీ మేరకు ముప్పిరితోట గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ప్రభుత్వ విప్పు ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పేర్కొన్నారు. గురువారం ముప్పిరి తోటలో డిపో మేనేజర్ కవితతో కలిసి విప్ విజయ రమణారావు గోదావరిఖని నుండి ముప్పిరితోట మీదుగా గర్రెపల్లి వరకు నడిచే ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య చరిత్రలో ఎన్నో ప్రభుత్వాలు, ఎందరో పాలకులు వచ్చినప్పటికీ పెద్దపల్లిలో ఆర్టీసీ డిపో ఏర్పాటుకు ప్రయత్నించిన దాఖలాలు లేవన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒప్పించి మెప్పించడం వల్లే 2024 డిసెంబర్‌లో పెద్దపల్లి లో నిర్వహించిన బహిరంగ సభలో బస్సు డిపో ఏర్పాటుకు ప్రకటన చేశారని చెప్పారు. రానున్న రెండు మాసాల్లో దేవి నవరాత్రుల ఉత్సవాల్లో పెద్దపల్లిలో బస్సు డిపోను ప్రారంభం చేసుకొని నియోజకవర్గ ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలను కల్పిస్తామన్నారు. మాటతప్పే అలవాటు లేదని, ప్రజల అవసరాలను గుర్తించి నిరంతరం పనిచేస్తానని చెప్పారు. రూ.12కోట్ల నిధులతో ఈ గ్రామం మీదుగా నిర్మాణం చేపడుతున్న డబుల్ రోడ్డు పనులను రెండు మాసాల్లో పూర్తి చేయిస్తానన్నారు. గ్రామాల్లో ఇల్లు లేని ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు, ఆరు మాసాల్లో రాష్ట్రంలో మూడు లక్షల పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేయనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి సర్పంచ్ మారం రాయమల్లు, తహసిల్దార్ యాకన్న, ఎంపీడీవో భాస్కర్ రావు, నాయకులు రామిడి వెంకట్రామిరెడ్డి,సమా రాజేశ్వర్ రెడ్డి,సంతోష్రావు, వెంకటేశ్వర రావు, దేవురాజు, లాలయ్య,పలు గ్రామాల సర్పంచులు, మహిళలు ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

# కాసిపేట మండల టీఆర్ఎస్ ఇంచార్జీగా సోదరి సురేష్ నియామకం

**కాసిపేట, తెలంగాణ చౌరస్తా:**



తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ కాసిపేట మండల ఇంచార్జీగా సోదరి సురేష్‌ను నియమించారు. ఈ మేరకు మాజీ కార్మికశాఖ మంత్రి, బెల్లంపల్లి నియోజకవర్గ ఇంచార్జి బోడ జనార్ధన్ నియామక పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా సోదరి సురేష్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. మండలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు.తనపై నమ్మకం ఉంచి కాసిపేట మండల ఇంచార్జీ బాధ్యతలు అప్పగించిన తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు, బెల్లంపల్లి నియోజకవర్గ ఇంచార్జీ బోడ జనార్ధన్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ప్రజల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.

# దేవాపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ

**కాసిపేట,తెలంగాణ చౌరస్తా :**

వార్షిక తనిఖీలలో భాగంగా గురువారం దేవాపూర్ పోలీస్ స్టేషన్‌ను బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, స్టేషన్‌లోని వివిధ రకాల కీలక రికార్డులు, శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించిన ఫైళ్లను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు.
ఫిర్యాదులు,కేసులను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించాలని, సీసీటీఎన్ఎస్‌లో నమోదులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సూచించారు. కోర్టులతో సమన్వయంతో పనిచేసి ఎక్కువ కేసుల్లో శిక్షలు అమలయ్యేలా కృషి చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు రక్షణ, భద్రత కల్పించడం పోలీసుల ప్రాథమిక విధి,బాధ్యత అని పేర్కొన్నారు.సిబ్బంది విధులను నిరంతరం పర్యవేక్షిస్తూ,వారు సమర్థవంతంగా పనిచేసేలా వారి నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమై నేరాల నివారణకు కృషి చేయాలని అన్నారు.ఈ తనిఖీలో మందమర్రి సీఐ పి. రమేష్,దేవాపూర్ ఎస్ఐ గంగారాం పాల్గొన్నారు.

# నేడు విద్యాసంస్థలు బంద్

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం పలు విద్యాసంస్థల బంద్కు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. నీట్ పేపర్ లీకేజీ దోషులను శిక్షించడంతోపాటు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో పలు పలు యూనివర్సిటీలు రేపు జరగాల్సిన పరీక్షలు వాయిదా వేశాయి. ఈ నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ), శాతవాహన యూనివర్సిటీ (ఎస్యూ), జేఎన్‌టీయూ, తెలంగాణ విశ్వవిద్యాలయం (టీయూ), కాళోజీ ఆరోగ్య వర్సిటీ పరిధిలో నిర్వహించే పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ మేరకు ఆయా వర్సిటీలు ప్రకటించాయి. అనుబంధ కళాశాలల్లో జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేస్తున్నామని, త్వరలో కొత్త తేదీని ప్రకటిస్తామని ఓయూ, జేఎన్‌టీయూ, ఎస్యూ, టీయూ, కాళోజీ ఆరోగ్య వర్సిటీ తెలిపాయి. ఈ మేరకు అనుబంధ కళాశాలలకు సమాచారం ఇచ్చినట్లు వెల్లడించాయి.మరోవైపు పలు విద్యా సంస్థల యాజమాన్యాలు పాఠశాలలు, కాలేజీలకు సెలవు ప్రకటించాయి. ఇప్పటికే కొన్ని ప్రైవేట్ యాజమాన్యాలు సెలవుకు సంబంధించిన సమాచారాన్ని తల్లిదండ్రుల మొబైల్ ఫోన్లకు సందేశాల ద్వారా తెలియజేస్తున్నాయి. బంద్ కారణంగా రాష్ట్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు రేపు మూతపడే అవకాశం ఉంది.

ఈ 24న జరిగే రాష్ట్రవ్యాప్త బంద్‌ను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ, ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎస్‌బీ, ఏఐపీఎస్‌యూ సంఘాలు ప్రకటనలో కోరాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థల నిర్వాహకులు, ఉపాధ్యాయులు సహకరించాలని విజ్ఞప్తి చేశాయి. దేశ విద్యావ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు.నీట్ పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. మే నెలలో జరిగిన ఈ పరీక్షలో భారీ ఎత్తున అవకతవకలు, ప్రశ్నాపత్రాల లీకేజీ జరిగినట్లు తేలడంతో విద్యార్థులు, విపక్షాలు, సామాజిక శ్రేణులు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతున్నారు.

# నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలి

- పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలి
- తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్

**కరీంనగర్, తెలంగాణ చౌరస్తా:**




నీట్ పరీక్షను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విద్యార్థులు డిల్లీలో తమ నిరసన తెలియజేస్తే వారి పైన పోలిసు వ్యవహరించిన తీరు పైన ఈరోజు కరీంనగర్ లో శాతవాహన యూనివర్సిటీ జేఏసీ చైర్మన్, తెలంగాణ రక్షణ సేన మానకొండూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమల్ల చైతన్య ఆద్వర్యంలో నిరవధిక దీక్షను ప్రారంభించారు.ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ విద్యార్థుల దీక్షకు జిల్లా పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించి మాట్లాడుతూ....దేశవ్యాప్తంగా సుమారు 25 లక్షల మంది విద్యార్థులు రాసే ప్రతిష్ఠాత్మక నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ కావడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటమేనని ఆయన పేర్కొన్నారు. డాక్టర్ కావాలనే లక్ష్యంతో ఎన్నో సంవత్సరాలుగా కష్టపడుతున్న విద్యార్థుల ఆశయాలను వరుస పేపర్ లీకేజీలు దెబ్బతీస్తున్నాయని, వాటిని అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.నీట్ పేపర్ లీకేజీ ఘటనలతో తీవ్ర మనోవేదనకు గురై పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు వస్తున్న వార్తలు అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఈ ఘటనల వల్ల నష్టపోయిన కుటుంబాలకు ఎవరు బాధ్యత వహిస్తారో కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ ప్రజాస్వామ్య పద్ధతిలో పార్లమెంట్ ముట్టడికి ప్రయత్నించిన కట్టబు ఢిల్లీలో పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. విద్యార్థులపై బలప్రయోగం చేయడం, మహిళా విద్యార్థులతో అమానుషంగా వ్యవహరించారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొంటూ, ఈ ఘటనకు బాధ్యులైన పోలీసు అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.మానకొండూరు నియోజకవర్గం ఇంచార్జీ చెన్నమల్ల చైతన్య మాట్లాడుతూ....నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (యుజిసి)కి యుపిఎస్సీ తరహాలో స్వయం ర్య కల్పించి, పరీక్షల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం, భద్రతను పెంపొందిస్తేనే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట వేయవచ్చని అభిప్రాయపడ్డారు.నీట్ పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఈ ఘటనకు కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు లింగంపల్లి నాగరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, మహిళా విభాగం అధ్యక్షురాలు అంకం శివరాణి, బీసీ విభాగం అధ్యక్షులు శ్రీరాముల రమేష్, ఆదివాసి విభాగం అధ్యక్షులు కుతాడి శ్రీనివాస్, సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, సీనియర్ నాయకులు బుడిగె పరుశురాం గౌడ్, మ్యాక వినోద్, లింగంపల్లి శ్రీనివాస్, భాసవేణి రాజేందర్, నూతి సాయి చరణ్, పుసాల పవన్, చింతరెడ్డి జైపాల్ రెడ్డి, ఎండి రజి, ఎండి హుస్సేన్, బండ అశోక్, ఎండి సాల్మ, జంగా అపర్ణ, అతహర్, పొన్నం శిరీష, కొలిపాక గౌతమి, శారద, ఆసియా సుల్తానా తదితరులు పాల్గొన్నారు

# మొక్కలు తొలగిస్తే చర్యలు తప్పవు

- సర్పంచ్ శైలజ సదానందం గౌడ్

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మీర్జంపేటలో గల వన మహోత్సవంలో భాగంగా సమ్మక్క సారలమ్మ కమాన్ నుంచి జాతర గద్దెల వరకు రహదారికి ఇరువైపులా మొక్కలు నాటుతున్నట్లు గ్రామ సర్పంచ్ శైలజ సదానందం గౌడ్ తెలిపారు. ఈ విషయమై స్థానిక భూ యజమానులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 25లోగా పంచాయతీలో లిఖితపూర్వకంగా తెలపాలని సూచించారు. నాటిన మొక్కలను తొలగిస్తే అటవీ, పోలీసు శాఖల ద్వారా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# చెట్లే మనిషికి జీవనాధారం

- చెట్లను పెంచడం పర్యావరణాన్ని కాపాడుదాం
- సర్పంచ్ మామిడి లత అశోక్.

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**



కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని ఇదులాపూర్ లో గల వన మహోత్సవంలో భాగంగా రహదారికి ఇరువైపులా మొక్కలు మొక్కలు నాటారు. సందర్భంగా గ్రామ సర్పంచ్ మామిడి లత అశోక్ మాట్లాడుతూ...చెట్లే మనిషికి జీవనాధారం అని చెట్లను పెంచడం ద్వారా పర్యావరణ సమతుల్యాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మామిడి లత అశోక్, ఉప సర్పంచ్ నూనె హరీష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ సతీష్, గ్రామస్తులు , తదితరులు పాల్గొన్నారు.